
ఈనాడు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం అక్టోబరు 18, 2024

కాటన్ కట్టడానికి తూట్లు

- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద అక్రమార్కుల దందా
- గేట్లకు రంధ్రాలు చేసి రొయ్య సీడ్ సేకరణ

ఈనాడు రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, ఆత్రేయపురం: ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 10 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేస్తున్న ధవళేశ్వరం ఆనకట్ట భద్రతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కాటన్ మహాశయుడు నిర్మించిన ఈ అద్భుత కట్టడం కనీస నిర్వహణను గత అయిదేళ్లలో జగన్ సర్కారు పట్టించుకోలేదు. దీనికి అక్రమార్కులూ తోడయ్యారు. బ్యారేజీ గేట్లకు తూట్లు పొడుస్తూ రొయ్య సీడ్ అపహరిస్తున్నారు.


బ్యారేజీ తలుపుల వద్ద బుట్ట కట్టేందుకు దిగిన వ్యక్తి


లాకు ఛాంబర్ తలుపులకు కట్టిన బుట్టలు.. (అంతర్‌చిత్రంలో) విత్తనం

నిబంధనలకు తూట్లు

ఆనకట్ట గేట్ల వద్ద రొయ్య విత్తనాల సేకరణ నిబంధనకు విరుద్ధం. బ్యారేజీ గేట్లకు కొందరు రంధ్రాలు చేసి గొట్టాలు అమర్చి ఈ పని చేస్తున్నారు. విజ్జేశ్వరం నుంచి ధవళేశ్వరం వరకు ఉన్న గోదావరి నాలుగు పాయల్లో రోజుకు వెయ్యి లీటర్లకు పైగా ఈ విత్తనాలు సేకరిస్తున్నట్లు అంచనా. లీటరు ధర సుమారు రూ.300 ఉండటంతో గిరాకీ ఉన్న ప్రాంతాలకు తరలిస్తున్నారు. బొబ్బర్లంకలో మత్స్యశాఖ కార్యాలయం ఉన్నా దృష్టి పెట్టడంలేదు.

నీటి వృథా.. సరిహద్దు వివాదాలు

ఇప్పటికే గేట్లు తుప్పు పట్టి ప్రమాదకరంగా ఉన్నాయి. వీటికి తోడు రంధ్రాలు చేస్తుండడంతో జలాలు వృథాగా పోతున్నాయి. రబీ పంట కాలంలో గోదావరికి నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు ఈ జలాలు ఎంతో కీలకం. ఫలానా నంబరు గేటు వరకు తమదంటూ సరిహద్దులు నిర్దేశించుకుని దందా సాగిస్తున్నారు. గతంలో బొబ్బర్లంక, ధవళేశ్వరం రహదారుల మధ్య వివాదం ఏర్పడి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తగా పోలీసులు జోక్యం చేసుకున్నారు. పటిష్ఠ నిఘాకు సీసీ కెమెరాలు పెడతామని చెప్పినా ఆ దిశగా చర్యలు లేవు. ప్రస్తుతం వరద తగ్గడంతో బ్యారేజీ వద్ద నిత్యం 100 మంది వరకు దందా సాగిస్తున్నట్లు జలవనరులశాఖ అధికారులు గుర్తించారు. వైకాపా పాలనలో నాయకుల జోక్యంతో దోపిడీకి అడ్డుకట్టపడలేదు. ఇప్పుడైనా దృష్టిసారిస్తే మేలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

లిఖించెద... సీతారామ చరితం



వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా గురువారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో అధికారికంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లరేవు ప్రాంతానికి చెందిన విద్యార్థి శీలం శ్రీను వాల్మీకి వేషధారణతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. సీతారామచరిత్రను తాళపత్రాలపై లిఖిస్తానన్నట్లుగా ఇలా తదేక దీక్షతో కనిపించడంతో అధికారులు అభినందించారు.
-న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

వైకాపా పాపం.. రహదారులకు శాపం

- నాడు బిల్లులు చెల్లించక గుత్తేదారుల డీలా
- మరమ్మతుల పనులకు టెండర్లలో మిశ్రమ స్పందన
- కూటమి ప్రభుత్వ చొరవతో తాజాగా ఆశలు


అధ్వానంగా పోతవరం ఆర్‌అండ్‌బీ రహదారి

కాకినాడ కలెక్టరేట్, పి.గన్నవరం, న్యూస్‌టుడే: గత అయిదేళ్లలో వైకాపా ప్రభుత్వం గుత్తేదారులకు చుక్కలు చూపించింది. ఏ అభివృద్ధి పనులు చేసినా బిల్లులు చెల్లించకపోవడం వారికి తీవ్ర నిరాశ మిగిల్చింది. ఇది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతు పనులపైనా ప్రభావం చూపింది. చిన్న గుత్తేదారులకు బిల్లులు ఎగ్గొట్టడంతో గుంతలు పూడ్చడానికి ఎవరూ ముందుకురాలేదు.

ఇదీ గుంతలు, మరమ్మతుల టెండర్ల పరిస్థితి

జిల్లా	ప్రతిపాదించిన పనులు	పొడవు (కి.మీ)	మంజూరైన నిధులు (రూ.కోట్లలో)
కాకినాడ	42	126	7.39
బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	71	265	17.68
తూర్పుగోదావరి	35	91	7.74

కూటమి ప్రభుత్వం కొలువుదీరాక జూన్‌లో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని ఆర్‌అండ్‌బీ రహదారుల్లో గుంతలు పూడ్చడం, మరమ్మతులకు కాకినాడ సర్కిల్ ఆర్‌అండ్‌బీ కార్యాలయం ప్రతిపాదనలు పంపింది. ఆమోదం రావడంతో గతనెలాఖరున కాకినాడ, పెద్దాపురం, అమలాపురం, రాజమహేంద్రవరం డివిజన్ల పరిధిలో రూ.32.81కోట్ల విలువైన 148 పనులకు టెండర్లు ఆహ్వానించారు.. ఈనెల 15తో గడువు ముగిసింది. రూ.13.97 కోట్ల విలువైన 71 పనులకు బిడ్లు దాఖలు కాగా, రూ.18.84కోట్ల విలువైన 77 పనులకు ఒక్క టెండరూ రాలేదు. రూ.40 లక్షలకు పైబడి రూ.5 కోట్ల విలువైన 7 పనులకూ ఇదే పరిస్థితి. బిడ్లు దాఖలైనవాటికి అగ్రిమెంట్లు పూర్తి చేసి, నవంబరు మొదటి వారం నుంచి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ఎస్ఈ జి.కంఠ తెలిపారు. మిగతా 77 పనులకు రీ-టెండర్లు పిలుస్తామన్నారు.

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 71 పనులకు టెండర్లు పిలవగా, రూ.5.73 కోట్ల విలువైన 22 పనులకు బిడ్లు దాఖలయ్యాయి. రూ.11.95 కోట్ల విలువైన 49 పనులకు టెండర్లు పడలేదు.

రూ.29కోట్ల బకాయిలు: గత రెండేళ్లుగా ఉమ్మడి జిల్లాలో చేపట్టిన రహదారుల మరమ్మతు పనులకు చిన్న గుత్తేదారులకు రూ.29కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉంది. వీరంతా రూ.10 లక్షల నుంచి రూ.50లక్షల లోపు పనులు చేసిన వారే. దశలవారీగా చెల్లింపులు చేపడితే కొత్త పనులకు బిడ్లు దాఖలయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

మరో రూ.22.81 కోట్ల పనులకు ఆమోదం: ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసిన వానలతో దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు రూ.22.81 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపగా త్వరలో ఆమోదం రానుంది. రాష్ట్ర వ్యాప్తంగా మరమ్మతులకు రెండో విడత నిధులిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ప్రకటించిన నేపథ్యంలో గుత్తేదారులు ముందుకు వచ్చే అవకాశముంది.

రూ.90కోట్ల బిల్లుల చెల్లింపు: ఉమ్మడి జిల్లా పరిధిలో గత అయిదేళ్లలో సీఆర్‌ఎఫ్, ఎన్‌డీబీ ద్వారా చేపట్టిన పనులకు రూ.300 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీరికి రెండు రోజుల క్రితం రూ.90 కోట్ల వరకు కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. దీంతో కీలకమైన సామర్లకోట-రాజానగరం రహదారి పనుల్లో కదలిక వచ్చింది. సీఆర్‌ఎఫ్ పనులు పూర్తి చేసేందుకు గుత్తేదారులు చొరవ చూపుతున్నారు.

పరమానందం.. పరంధాముడి పరిణయం


కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు, పండితులు

ద్వారకాతిరుమల: కలియుగ ప్రత్యక్ష దైవం ద్వారకా తిరుమల శ్రీనివాసుడు పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లను పరిణయమాడిన ఘట్టం భక్తులకు నయనానందం పంచింది. ఆశ్వయుజ మాస ఉత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయానికి తూర్పు వైపున ప్రత్యేక మండపం ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లను వేర్వేరు వాహనాలపై మండపానికి తీసుకొచ్చారు. సుముహూర్త సమయాన జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు వంటి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, దేవస్థానం ఛైర్మన్ సుధాకరరావు, ఈవో మూర్తి, అనువంశిక ధర్మకర్త నివృతరావు ప్రభుత్వం తరఫున స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణ మహోత్సవం అనంతరం వెండి గరుడ, సింహ వాహనాలపై గ్రామోత్సవాలు నిర్వహించారు. స్వామివారు మోహిని అలంకరణలో దర్శనమిచ్చారు.

ఉత్సవాల్లో నేడు: కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఏడు గంటలకు స్వామివారి రథోత్సవం ఉంటుంది.

నకిలీలలు

అన్నవరంలో వసతి గదులకు ఫోర్జరీ రసీదుతో హల్‌చల్

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో వసతి గదుల కేటాయింపునకు సంబంధించి నకిలీ రసీదును అధికారులు గుర్తించారు. సత్యగిరిపై హరిహరసదన్ వసతి సముదాయంలో నాలుగు గదులు ముందస్తు రిజర్వేషన్ చేయించుకున్నానని.. తనకు కేటాయించాలని ఓ వ్యక్తి బుధవారం రాత్రి వచ్చారు. రసీదు పరిశీలించిన అధికారులు వివరాల్లో తేడా కనిపించి నకిలీగా గుర్తించారు. దీనిపై ప్రశ్నించడంతో జారుకున్నాడు. సాధారణంగా ఒక రసీదుకు ఒక గదిని మాత్రమే కేటాయిస్తారు. కానీ నకిలీ రసీదుపై నాలుగు గదులు, రూ.8 వేల మొత్తం అని ఉంది. ఉద్యోగి సంతకం కూడా ఫోర్జరీ చేసి ఉంది. ఈ ఏడాది ఆగస్టులో విష్ణుసదన్ హాలును ఓ భక్తుడు ముందస్తు రిజర్వేషన్ చేసుకోగా ఆ పత్రాన్ని సేకరించి వివరాలు తమకనుకూలంగా మార్చి ఫోర్జరీ చేసినట్లు భావిస్తున్నారు. అతడిని ఎవరైనా వ్యక్తులు మోసం చేశారా అనే కోణంలోనూ పరిశీలిస్తున్నారు. వసతి గదులకు ఉన్న డిమాండ్‌ను ఆసరాగా చేసుకొని నగదు వసూలు చేసి బోల్తాకొట్టి ఉండొచ్చని తెలుస్తోంది.

దళారుల హవా: గదుల ఆన్‌లైన్ బుకింగ్‌లో కొందరు దళారులు మోసాలకు పాల్పడుతున్నారు. సాధారణంగా 30 రోజులముందే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవచ్చు. వివిధ పేర్లతో ఆధార్ నకళ్లను సేకరించి గదులను దళారులు దక్కించుకుంటున్నట్లు తెలుస్తోంది. గదులు కేటాయించే సమయంలో ఎవరి ఆధార్‌తో ముందస్తు రిజర్వేషన్ చేయించుకున్నారో ఆ వ్యక్తే రావాలి. ఆధార్ ఎవరు తెచ్చినా గది కేటాయిస్తుండటంతో మోసాలకు ఆస్కారం ఏర్పడుతోంది.

విజయబేతాళస్వామి ఉత్సవాలకు బందోబస్తు

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేటలో జరిగే విజయబేతాళస్వామి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ ఆర్.భీమరాజు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జరిగే ఉత్సవాల్లో బందోబస్తు గురించి గురువారం ఆయన వివరించారు. ఆరుగురు సీఐలు, 23 మంది ఎస్సైలు, 60 మంది హెచ్‌సీలు, 150 మంది కానిస్టేబుళ్లు, 23 ఏఎస్ఎస్, సాయుధ బలగాలు, 35 మంది హోంగార్డులు, మొబైల్ పార్టీలను నియమించినట్లు చెప్పారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అమలాపురం నుంచి వచ్చే వాహనాలు గంగలకుర్రు మలుపు నుంచి పుల్లేటికుర్రుకు, పి.గన్నవరం నుంచి వచ్చే వాహనాలను మాచవరం నుంచి అవిడిరేవు వైపు మళ్లిస్తున్నట్లు తెలిపారు. భారీ వాహనాలు అమలాపురం ఈదరపల్లి మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకున్నామన్నారు. వాహనచోదకులు సహకరించాలని కోరారు.

కడలి మిగిల్చిన కష్టం

సముద్ర పోటుతో మునిగిన ఆక్వా చెరువులు

అల్లవరం, న్యూస్‌టుడే: కష్టనష్టాలకు ఓర్చుకుని తీరం వెంబడి ఆక్వాసాగు చేస్తున్న రైతులపై సముద్రం కన్నెర్ర జేసింది. మరో 15 రోజులు ఆగితే అప్పుల నుంచి ఉపశమనం కలుగుతుందని భావించిన వారిని ఇప్పట్లో కోలుకోలేనంతగా ఊబిలోకి నెట్టేసింది. రాత్రికి రాత్రి సముద్రం చెరువులను ముంచెత్తింది. రొయ్యలు సముద్రంలో కలిసిపోయాయి. కనీసం పట్టుబడి ఖర్చులు వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.


అల్లవరం మండలం ఓడలరేవులో చెరువును ముంచెత్తిన అలలు

అల్లకల్లోలంగా సముద్రం

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో నాలుగు రోజుల నుంచి సముద్రం అల్లకల్లోలంగా మారింది.

రూ.2.50 కోట్ల మేర నష్టం

ఓడలరేవు సముద్ర తీరంలో బీచ్ నుంచి ఓఎన్జీసీ ప్లాంట్ చివర వరకు తీరం వెంబడి సుమారు 40 ఎకరాల్లో 15 మంది రైతులు రొయ్యల సాగు చేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో కెరటాల తీవ్రత ఎక్కువ కావడంతో చెరువుల గట్లు తెగిపోయి రొయ్యలు సముద్రంలోకి కొట్టుకు పోయాయి. ఇక్కడ సాగు చేస్తున్న రైతులకు రూ.2.50 కోట్ల మేర నష్టం వాటిల్లింది.


మలికిపురం మండలం తూర్పుపాలెంలో సముద్రం ముందుకు రావడంతో మునిగిన ఆక్వా చెరువులు

ప్లాంట్‌లోకి నిలిచిన రాకపోకలు..

అలల తీవ్రతకు కొట్టుకు వచ్చిన చెత్త ప్లాంట్ లోపలకు వెళ్లే రహదారిపై చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. ఆ ప్లాంట్‌లో విధులు నిర్వహించే సిబ్బంది సుమారు కిలోమీటరు మేర నడుచుకుంటూ ప్లాంట్‌కు చేరుకున్నారు. అలల ఉద్ధృతి తగ్గిన తర్వాత రహదారిపై పేరుకుపోయిన చెత్త తొలగింపు పనులు చేపట్టనున్నట్లు ఓఎన్జీసీ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

రూ.30 లక్షల మేర నష్టం

మేం కొన్నాళ్లుగా ఇక్కడ ఆక్వా సాగు చేస్తున్నాం. నిత్యం అప్రమత్తంగా ఉండే వాళ్లం. బుధవారం బంధువుల ఇంటికి విశాఖపట్నం వెళ్లాల్సి రావడంతో మరో వ్యక్తిని చెరువు వద్ద కాపలా ఉంచినా ఫలితం లేకుండా పోయింది. మూడు ఎకరాల్లో పంట సముద్రంలోకి కొట్టుకు పోయింది. నాకు సుమారు రూ.30లక్షల మేర నష్టం వాటిల్లింది.
-సత్యనారాయణ రాజు, రైతు

ఒక్క రాత్రిలో పరిస్థితి తలకిందులు

ఒక్క రాత్రిలో మా పరిస్థితి తలకిందులుగా మారిపోయింది. నేను ఇక్కడ ఆరు ఎకరాల్లో సాగు చేశా. వాతావరణం అనుకూలించడంతో పంట ఆశాజనకంగా ఉంది. మరో 15 రోజుల్లో 40 కౌంట్‌కు చేరుకుంటుంది. పట్టుబడి చేద్దామనుకునే లోపల సముద్రం విరుచుకు పడింది. దీంతో ఒక్క రాత్రిలో తీవ్ర నష్టం వాటిల్లింది. కనీసం వలలు ఏర్పాటు చేసుకునే అవకాశం లేకపోవడంతో తీవ్రంగా నష్ట పోయాం. నాకు సుమారు రూ.65 లక్షల మేర నష్టం కలిగింది.
-వాసంశెట్టి గంగాజలం, రైతు

పరుగులు పెట్టించి.. పిక్కలు పీకేసి..

పిచ్చికుక్క దాడిలో 25 మందికి గాయాలు


ఓ వ్యక్తి కాలికి తీవ్ర గాయం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురంలో గురువారం రాత్రి పిచ్చికుక్క బీభత్సం సృష్టించింది. రహదారిపై నడిచి, వాహనాలపై వెళ్లేవారిపై దాడి చేసింది. పరుగులు పెడుతూ 25 మందిని గాయపర్చింది. బాధితుల్లో ఎక్కువ మంది మహిళలు, వృద్ధులు ఉన్నారు. పట్టణంలోని బస్టాండ్ ప్రాంతం, సుబ్బాలమ్మ గుడి ఆలయం వద్ద, దుడ్డువారి అగ్రహారం, విత్తనాలవారి కాలువగట్టు సమీపంలో కుక్క స్వైర విహారం చేసింది. గట్టిగా అరుస్తూ భయభ్రాంతులకు గురిచేసింది. ఆ ప్రాంతాల్లోని జనం చాలాసేపు బయటకు రాలేదు. బస్టాండ్ ఎదురుగా సీతాపతిరావుపేటకు చెందిన భార్యభర్తలు చప్పిడి సత్యనారాయణ, అనంతలక్ష్మిని తీవ్రంగా గాయపర్చింది. మూడేళ్ల బాలుడిపైనా దాడి చేసింది. మున్సిపల్ కమిషనర్ రాజు మాట్లాడుతూ నలుగురు యువకులు కుక్కను కొట్టి చంపివేశారని తెలిపారు. బాధితులు స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు సత్యనారాయణ, అనంతలక్ష్మి

ప్రమాదం పట్టని ప్రచారం

మండపేటలో ప్రకటన బోర్డులు ప్రజలను భయపెడుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే స్థానిక బస్టాండ్ ఎదురుగాగల మేడలపై ఏర్పాటు చేసిన బోర్డు ఫ్లెక్సీలు గాలికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. గాలి వీచినప్పుడు బోర్డులకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చినిగి పక్కనే ఉన్న విద్యుత్తు తీగలకు తగులుతున్నాయి. దీని వల్ల మంటలు చెలరేగే ప్రమాదం ఉంది. ఇటువంటి ప్రకటన బోర్డులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పట్టణ ప్రణాళిక అధికారి శ్రీధర్‌ను వివరణ కోరగా ప్రమాదకరంగా ఉన్న వాటిని తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు.
- న్యూస్‌టుడే, మండపేట


మండపేట బస్టాండ్ సమీపంలో ప్రమాదకరంగా మారిన ఫ్లెక్సీలు

సుందరీకరణ ఎప్పటికో?

- నత్త నడకన దిండి రిసార్ట్స్ పునర్నిర్మాణ పనులు

ఏపీటీడీసీ(ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలోని దిండి హరిత కోకోనట్ కంట్రీ రిసార్ట్స్ పునర్నిర్మాణ, అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరిన్ని ఆధునిక సౌకర్యాలతో సుందరీకరించేందుకు సుమారు రూ.7 కోట్లతో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం 32 గదులు ఉండగా అందులో సగం పర్యాటకులకు అందుబాటులో ఉంచి.. మిగతా వాటి ఆధునికీకరణ ప్రారంభించారు.
- న్యూస్‌టుడే, మలికిపురం

దిండి రిసార్ట్స్ అభివృద్ధి పనుల్లో భాగంగా తూర్పువైపున ఉన్న పైఅంతస్తు స్లాబ్‌ను తొలగించి కొత్తది వేశారు. గదులు, మరుగుదొడ్లలో పూర్తిగా ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న సమావేశ మందిరం(ఫంక్షను హాల్), రెస్టారెంట్, బార్‌లను ప్రస్తుత సామర్థ్యాన్ని పెంచి నిర్మిస్తున్నారు. భవనంలో మరో నాలుగైదు సూట్ గదులతో పాటు లిఫ్ట్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఆవరణలో పూల మొక్కలు, లాన్, పచ్చదనాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఈ పనులు పూర్తయి పర్యాటకులకు అందుబాటులోకి వచ్చాక మిగిలిన భాగంలో పనులు ప్రారంభించాల్సి ఉంది. నిధుల లభ్యతను బట్టి మరో అంతస్తు కూడా వేయడం ద్వారా మరో 20 గదులు అందుబాటులోకి తెచ్చే ఆలోచన చేస్తున్నారు. గత ఏప్రిల్ నెలలో ప్రారంభమైన పనులు జులై, ఆగస్టు నెలకే పూర్తవ్వాల్సి ఉండగా ఇప్పటికీ 50 శాతం మాత్రమే పూర్తయ్యాయి. కనీసం జనవరి నెల నాటికి పూర్తిచేసి పర్యాటకులకు అందుబాటులోకి తెస్తే బాగుంటుందని వాదన వినిపిస్తోంది.


రిసార్ట్స్ వద్ద పనులు

విశేష ఆదరణ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచే గాక ఇతర రాష్ట్రాల నుంచి సైతం పర్యాటకులు పెద్దఎత్తున వస్తుంటారు. ఏడాదికి రూ.3 కోట్ల వరకు ఆదాయం లభిస్తుంది. గృహ పడవలు, స్పీడ్‌బోట్లు, ఫంటూన్ బోట్లపై నదీ విహారం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. బోటింగ్‌పై కూడా రిసార్ట్స్‌కు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఏడాదికి ఆదాయం వస్తుంది. ఈ నేపథ్యంలో హరిత కోకోనట్ కంట్రీ రిసార్ట్స్‌ను ఆధునికీకరించడం అవసరమని పర్యాటకులు అభిప్రాయపడుతున్నారు.

నవంబరు నాటికి పూర్తి

ప్రస్తుతం చేపట్టిన పనులు నవంబరు నెలాఖరు కల్లా పూర్తిచేసేలా కృషి జరుగుతోంది. కొత్త ప్రభుత్వం వచ్చాక ఆకృతులు(డిజైన్) మారడం వల్ల జాప్యం ఏర్పడింది.
- కె.మురళీధర్, మేనేజర్, దిండి రిసార్ట్స్

ఆర్టీసీకి దసరా ధమాకా

రూ.42 లక్షల అదనపు ఆదాయం



న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

దసరా సెలవులు ఆర్టీసీకి కాసులు కురిపించాయి. గతంలో పండగ సమయాల్లో ప్రత్యేక ఛార్జీలు వసూలు చేయడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఈ సారి మాత్రం అలాంటి ఛార్జీలు లేకపోవడంతో ప్రయాణికులు ఆదరించారు. ఈ నెల 3 నుంచి పాఠశాలలు, కళాశాలలకు సెలవులు కావడంతో హైదరాబాద్, విశాఖపట్టణం, విజయవాడతోపాటు పలు ప్రాంతాల నుంచి ప్రయాణికులు కోనసీమ ప్రాంతానికి తరలివచ్చారు.

ఈ నెల 1 నుంచి 16 వరకు డిపోల వారీగా ఆదాయం

డిపో	బస్సులు	ఆదాయం
అమలాపురం	66	19,36,042
రావులపాలెం	40	10,27,275
రాజోలు	30	8,09,779
రామచంద్రపురం	16	5,05,811

జిల్లాలో ఇలా..

దసరా సెలవుల నేపథ్యంలో ఈ నెల ఒకటో తేదీ నుంచే ప్రయాణాలు మొదలయ్యాయి. జిల్లాలో అమలాపురం, రాజోలు, రావులపాలెం, రామచంద్రపురం డిపోలున్నాయి. ఈ నాలుగు డిపోల నుంచి 152 ప్రత్యేక బస్సులు నడిపారు. వీటి ద్వారా రూ.42.78 లక్షలు ఆదాయం సమకూరింది. అమలాపురం డిపో రూ.19.36 లక్షల ఆదాయాన్ని సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. 16 రోజుల్లో ఆక్యుపెన్సీ రేటు 74గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

అందరి సహకారంతో..

రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడిపాం. దసరా సెలవుల్లో ఆర్టీసీ బస్సులను ఆయా డిపోల్లోని అధికారులు, సిబ్బంది సమిష్టి కృషితో నడపడంతో అదనపు ఆదాయాన్ని అందిపుచ్చుకున్నాం. సిబ్బంది సేవలు అభినందనీయం.
-ఎం.శ్రీనివాసరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి

సముద్రం.. అల్లకల్లోలం

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా గత రెండు రోజులుగా అల్లకల్లోలంగా ఉన్న సముద్రం గురువారం మలికిపురం మండలం తూర్పుపాలెంలో ముందుకు చొచ్చుకువచ్చింది. తీరం వెంబడి శంకరగుప్తం వరకు ఉన్న బీటీ రహదారి పూర్తిగా మోకాలి లోతు నీటిలో మునిగిపోయింది. వాటిలో నుంచే రైతులు రాకపోకలు సాగించారు. సమీపంలోని సరుగుడు తోటలు, కొబ్బరి తోటల్లోకి ఉప్పు నీరు ప్రవేశించిందని, దీని వల్ల తమ తోటలు దెబ్బతింటాయని స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు.



- న్యూస్‌టుడే, మలికిపురం



పడవలు.. తీరానికే పరిమితం

తుపాను నేపథ్యంలో మత్స్యకారులు వేటకు విరామం ప్రకటించారు. అల్లవరం మండలం ఓడలరేవులో వేట బోట్లు తీరానికే పరిమితం అయ్యాయి. ఓడలరేవు జెట్టీ నుంచి విశాఖ, నక్కపల్లి, శ్రీకాకుళం, కోనసీమ ప్రాంతాలకు చెందిన వందల బోట్లు వేటకు సముద్రంలోకి వెళ్తాయి. మూడు రోజులుగా తీరంలో నిలిచి పోయాయి.

- న్యూస్‌టుడే, అల్లవరం

ఊరేగింపు.. శోభాయమానం

దేవతామూర్తుల వేషధారణలతో గొల్లప్రోలులో గురువారం భారీ ఊరేగింపు నిర్వహించారు. దేవీ నవరాత్రి మహోత్సవాలు ముగిసిన నేపథ్యంలో నిమజ్జనోత్సవంలో భాగంగా స్థానిక సూరంపేటలోని కనకదుర్గ అమ్మవారి ఆలయం నుంచి భారీ సంఖ్యలో ట్రాక్టర్లతో ప్రదర్శన కొనసాగించారు. కనకదుర్గ అమ్మవారి వేషధారణ ప్రత్యేకంగా నిలిచింది. తీన్‌మార్ డప్పు వాయిద్యాలు, నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. 32 ఏళ్లుగా సూరంపేటలోని కనకదుర్గమ్మ ఆలయంలో దేవీ నవరాత్రి మహోత్సవాల్లో దేవతామూర్తుల వేషధారణలతో ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.



- న్యూస్‌టుడే, గొల్లప్రోలు

డెల్టాకు నీటి విడుదల

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 6,100 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలకు 1300, 1800, 3000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాటన్ బ్యారేజీ వద్ద 10.90 అడుగుల నీటిమట్టం కొనసాగుతోందన్నారు. 55,862 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నట్లు వివరించారు.

నవోదయలో 9, 11 తరగతుల్లో చేరేందుకు అవకాశం

పెద్దాపురం: పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న 9, 11వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైస్ ప్రిన్సిపల్ రామకృష్ణయ్య గురువారం తెలిపారు. కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన విద్యార్థులు అవకాశం వినియోగించుకోవచ్చన్నారు. దరఖాస్తులను నవోదయ వెబ్‌సైట్ ద్వారా చేసుకోవాలన్నారు.

ఎఫ్ఏసీ బాధ్యతల అప్పగింత

ధవళేశ్వరం: జలవనరులశాఖలో పనిచేస్తున్న డిప్యూటీ ఈఈలకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ధవళేశ్వరం పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ఎల్ఎంసీ డివిజన్‌లో పనిచేస్తున్న డిప్యూటీ ఈఈ కె.శ్రీనివాసరావుకు పీఐపీ ఎల్ఎంసీ డివిజన్ ఎలమంచిలి, తుని పీఐపీలో ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. గన్నవరం పీఐపీ ఆర్ఎంసీ సబ్‌డివిజన్‌లో డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న ఎం.కిషోర్‌కు డ్రేనేజీ డివిజన్ కాకినాడ ఇరిగేషన్ సర్కిల్, ధవళేశ్వరంలో ఎఫ్ఏసీ బాధ్యతలు ఇచ్చారు.

ఆశల పల్లకిలో ఆశావహులు

● సాగునీటి సంఘాలపై నేతల దృష్టి ● అప్పుడే మొదలైన పైరవీలు

న్యూస్‌టుడే, పి.గన్నవరం, ముమ్మిడివరం

గత తెదేపా హయాంలో పంట, మురుగు కాలువల, సాగు నీటి కట్టడాల నిర్వహణ పనులను సాగు నీటి సంఘాల ప్రతినిధుల పర్యవేక్షణలో నిర్వహించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా అయిదేళ్లపాటు ఈ వ్యవస్థను పక్కనపెట్టేయడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. వ్యవసాయానికి ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 16న ఎన్నికల ప్రకటన ఇవ్వాల్సి ఉండగా తుపాను కారణంగా తాత్కాలికంగా వాయిదావేసినట్లు జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు. వర్షాలు తగ్గిన తరువాత ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ పదవులను ఆశించే ఆశావహులు ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. తెదేపా, జనసేన, భాజపా నేతలు పలువురు సాగు నీటి సంఘాలకు ప్రతినిధులు కావాలని ఉవ్విళ్లూరుతున్నారు.

సాగు నీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో టీసీల వారీ ఓటర్ల జాబితాలు తయారు చేసే పనిలో రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమైంది. జలవనరులశాఖ వద్ద గతంలో ఉన్న రికార్డుల మేరకు టీసీల వారీ ఆయకట్టు, సర్వే నంబర్లవారీ రైతుల వివరాలను ఆ శాఖ అధికారులు ఇప్పటికే రెవెన్యూ శాఖ అధికారులకు అందజేశారు. గతంలో ఉన్న సాగు భూములు ఇళ్ల స్థలాలు, ఇతర కట్టడాలుగా మారాయి. అలాంటి వాటిని ఓటర్ల జాబితాలనుంచి తొలగిస్తారు. ప్రస్తుతం వాస్తవంగా ఉన్న ఓటర్ల(రైతులు)తో తాజాగా ఓటర్ల జాబితాలను రూపొందిస్తున్నారు.



పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్విడక్టు

ఉమ్మడి జిల్లాలో ఇలా

గోదావరి డెల్టా సిస్టమ్ పరిధిలో 144 సాగునీటి వినియోగదారుల సంఘాలు, 25 నీటి పంపిణీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీ ఉన్నాయి. ● ఏలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు పరిధిలో 25 సాగునీటి సంఘాలు, అయిదు నీటి పంపిణీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీ ● తొర్రిగడ్డ పంపింగ్ స్కీములో నాలుగు సాగు నీటి సంఘాలు, ఒక ప్రాజెక్టు కమిటీ ● పంపా రిజర్వాయర్ ప్రాజెక్టులో ఆరు సాగు నీటి సంఘాలు, ఒక ప్రాజెక్టు కమిటీ ● సుబ్బారెడ్డిసాగర్ ప్రాజెక్టులో ఆరు సాగునీటి సంఘాలు, ఒక ప్రాజెక్టు కమిటీ ● మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు పరిధిలో 216 సాగు నీటి సంఘాలు ఉన్నాయి.

తమ స్థాయిని బట్టి..

● నాయకులు తమ స్థాయినిబట్టి అధ్యక్షులు, నీటి పంపిణీ కమిటీ ఛైర్మన్ల పదవులను కొందరు, ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్లు కావాలని మరికొందరు ఆశిస్తున్నారు. పి.గన్నవరం మండలంలో ఒక సాగు నీటి సంఘానికి సంబంధించి ఇద్దరు గట్టిగా పోటీపడుతున్నారు. ఇద్దరిలో ఒకరు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యే ద్వారా కోనసీమలోని ఒక ఎమ్మెల్యేకి అప్పుడే సిఫార్సు చేయించినట్లు సమాచారం. గతంలో పని చేసిన సాగు నీటి సంఘాల ప్రతినిధులు ఎక్కువగా మళ్లీ ఆ పదవులను ఆశిస్తున్నారు. కొందరైతే నేరుగా జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వద్దకు వెళ్లి బయోడేటాలు ఇస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా ముందుగా టీసీ మెంబరు కావాలి. ఇందుకోసం టెరిటోరియల్ కానిస్టెన్సీ పరిధిలోని ఓటర్లైన రైతులను కూడా ఆశావహులు కలిసి తమకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గతంలోని కమిటీలన్నింటికీ...

సాగునీటి సంఘాలకు సంబంధించి ఓటర్ల జాబితాలు తయారు చేస్తున్నారు. దాదాపుగా గతంలో ఉన్న కమిటీలకు ఎన్నికలు జరుగుతాయి. నోటిఫికేషన్ వాయిదా పడటంతో షెడ్యూల్‌లో కూడా మార్పులు ఉంటాయి.

- ఎన్.పుల్లారావు, చీఫ్ ఇంజినీర్, గోదావరి డెల్టా సిస్టమ్

గిరి ప్రదక్షిణ ఏర్పాట్ల పరిశీలన

అన్నవరం, న్యూస్‌టుడే : పవిత్ర కార్తిక మాసంలో నవంబరు 15న జరగనున్న అన్నవరం సత్యదేవుని గిరి ప్రదక్షిణ ఏర్పాట్లను అధికారుల బృందం గురువారం పరిశీలించారు. ఇంజినీరింగ్, వివిధ విభాగాల అధికారుల బృందం గిరిప్రదక్షిణ జరిగే మార్గంలో భక్తులకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. రోడ్డును శుభ్రం చేయడం, ఎండు గడ్డి వేయడం, తాగునీరు, పండ్లు, ఇతర ఆహార పదార్థాలు, ప్రసాదం పంపిణీకి స్టాల్స్, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు తదితరాలను పరిశీలించారు.

● దేవస్థానంలో గురువారం రద్దీ నెలకొంది. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. నూతన వధూవరుల సందడి కనిపించింది. కొండపైన, వివిధ ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న నూతన వధూవరులు పెద్దసంఖ్యలో వచ్చి వ్రతమాచరించి, స్వామిని దర్శించుకున్నారు. పౌర్ణమి సందర్భంగా వనదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యంగిర హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు.



మార్గాన్ని పరిశీలిస్తున్న ఆలయ అధికారులు

నర్సుల ఎన్నికల్లో ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఏకగ్రీవం

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సంఘ ఎన్నికలకు సంబంధించి మొత్తం 17 నామపత్రాలు దాఖలయ్యాయి. వాటిని పరిశీలించగా, ఒకటి సరిగా లేకపోవడంతో తిరస్కరణకు గురైనట్లు ఎన్నికల అధికారి టి.నందన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మిగిలిన 16 సక్రమంగా ఉన్నాయన్నారు. ఎగ్జిక్యూటివ్ సభ్యుల పదవులకు వచ్చిన ఆరు నామపత్రాల్లో ఒకటి తిరస్కరణకు గురవ్వడంతో అయిదు మాత్రమే మిగలడంతో ఏకగ్రీవం అయ్యాయని ప్రకటించారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు 23న ఎన్నికలు జరుగుతాయన్నారు. 18 సాయంత్రం 5 గంటల వరకూ నామపత్రాల ఉపసంహరణకు గడువు ఉందన్నారు.

సాయిబాబా మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

మలికిపురం, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని మానవహక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు అన్నారు. మలికిపురం పులె-అంబేడ్కర్ సామాజిక భవనంలో చైతన్య సమితి ప్రధాన కార్యదర్శి మంద సత్యనారాయణ అధ్యక్షతన గురువారం జరిగిన సంతాప సభలో పలువురు వక్తలు పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు. వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేడిద రాజేశ్ మాట్లాడుతూ ఉద్యమకారులపై ఉక్కుపాదం మోపి ఉద్యమాలను అణచివేసే ప్రయత్నంలోనే సాయిబాబాను అక్రమంగా నిర్బంధించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్‌ఇక్బాల్, ముత్యాల శ్రీనివాసరావు, మానవహక్కుల జిల్లా సంఘం కన్వీనరు జిల్లెళ్ల మనోహరం, చైతన్యసమితి, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మానవహక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు

మహోన్నతుడు వాల్మీకి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రామాయణాన్ని గ్రంథ రూపంలో మానవాళికి అందించిన మహోన్నత వ్యక్తి వాల్మీకి మహర్షి అని కలెక్టర్ మహేష్‌కుమార్ కొనియాడారు. గురువారం కలెక్టరేట్‌లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రామాయణం కుటుంబ విలువలను తెలియజేస్తోందన్నారు. అందులోని మానవతా విలువలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వాల్మీకి వేషధారణలో చిన్నారి శీలం శ్రీను ఆకట్టుకున్నాడు. డీఆర్వో వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ శాఖ అధికారి ప్రసాద్, కలెక్టరేట్ ఏవో విశ్వేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, అధికారులు

వినాయక సదన్ అభివృద్ధికి రూ.3 లక్షల విరాళం



దాతకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో

అయినవిల్లి, న్యూస్‌టుడే: అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయంలో వినాయక సదన్ అభివృద్ధికి గురువారం స్థానికుడు మద్దింశెట్టి బ్రహ్మయ్య కుమార్తె నల్లం లక్ష్మీనరసమ్మ ఆమె భర్త బాలకృష్ణారావు పేరిట రూ.3 లక్షల విరాళాన్ని ఈవో సత్యనారాయణ రాజుకు అందజేశారు. వారికి ఆలయ అర్చకుడు స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని బహూకరించారు.

సైన్స్ సెంటర్ పరిశీలన

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం పట్టణం రామారావుపేటలోని అల్లంరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసీటీ సైన్స్ సెంటర్‌ను గురువారం విజయవాడకు చెందిన మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఛైర్మన్ పి.మధు, కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా సైన్స్ సెంటర్లోని వివిధ రకాల పరికరాల గురించి, విద్యార్థులకు ప్రయోగాలు చెప్పే విధానాన్ని సెంటర్ నిర్వాహకుడు బుద్ధా శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి కేంద్రాలుగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సైన్స్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు వారు తెలిపారు. వెంట నవీన్ నాని, సునీత ఉన్నారు.



కేంద్రం పనితీరుపై ఆరా తీస్తున్న మధు

తుపాను బాధితులకు ప్రభుత్వం అండ: వర్మ

కొత్తపల్లి, న్యూస్‌టుడే: తుపాను ప్రభావం కారణంగా తీర ప్రాంత గ్రామాల్లో గృహాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ హామీ ఇచ్చారు. గురువారం యు.కొత్తపల్లి మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో ఆయన పర్యటించి కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వైకాపా ప్రభుత్వంలో అర్హులకు కాకుండా, వారికి నచ్చినవారికి ఇళ్లస్థలాలు ఇచ్చారన్నారు. సముద్రం ఒడ్డునున్న ప్రతి కుటుంబానికి సురక్షిత ప్రాంతాల్లో ఇళ్లస్థలాలు కేటాయించి పక్కా గృహాలు నిర్మించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తీర ప్రాంతాలు కోతకు గురవకుండా రక్షణగోడ నిర్మిస్తామని హామీ ఇచ్చారని, త్వరలోనే ఆ ప్రాజెక్టు ముందుకొస్తుందన్నారు. కాకినాడ ఆర్డీవో మల్లిబాబు బుధవారం ఉప్పాడ, జగ్గరాజుపేట, సూరాడపేటల్లో పర్యటించి కోత పరిస్థితిని పరిశీలించారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దన్నారు. కూలిన స్తంభాలు మార్చి విద్యుత్తు సౌకర్యం కల్పిస్తామన్నారు.



సూరాడపేటలో కోత ప్రభావాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

ట్రాన్స్‌కోకు రూ.5.50 లక్షల నష్టం

పి.గన్నవరం: వాయుగుండం ప్రభావంతో జిల్లాలో కురిసిన వర్షాలు, ఈదురుగాలులకు ట్రాన్స్‌కోకు రూ.5.50 లక్షల మేర నష్టం వాటిల్లిందని ఎస్ఈ ఎస్.రాజబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎనిమిది ట్రాన్స్‌ఫార్మర్లు, ఆరు విద్యుత్తు స్తంభాలు దెబ్బతిన్నాయన్నారు. ఎక్కువగా పి.గన్నవరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం మండలాల్లో ఈ నష్టం జరిగిందని, విద్యుత్తు సరఫరాలో ఏర్పడిన అవాంతరాలను సరిచేసి వెంటనే పునరుద్ధరణ చర్యలు తీసుకున్నామన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి)	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	13,000-13,500
కొత్త (పచ్చి) కాయ	12,500-13,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	130-00
రిటైల్ లైవ్	152-00
డ్రెస్డ్	220-00
స్కిన్‌లెస్	251-00

గంజాయితో పట్టుబడ్డ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: వారంతా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే. ప్రముఖ కంపెనీల్లో పనిచేస్తూ ఆకర్షణీయమైన జీతం అందుకుంటున్నారు. కానీ, గంజాయికి బానిసై జైలు పాలయ్యారు. కేపీహెచ్‌బీ ఎస్సై సుమన్ వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం కేపీహెచ్‌బీ అయిదో ఫేజ్ డీమార్ట్ సమీపంలోని ఖాళీస్థలంలో పలువురు యువకులు గంజాయి పొట్లాలతో ఉన్నారన్న సమాచారంతో బాలానగర్ జోన్ ఎస్వోటీ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. యువకులు పారిపోయేందుకు యత్నించగా చాకచక్యంగా పట్టుకుని కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు. యువకులు పని ఒత్తిడి నుంచి ఉపశమనం కోసమే గంజాయి తాగుతున్నట్లు పోలీసులకు చెప్పడం గమనార్హం. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలానికి చెందిన తోరటి రాజేశ్(24), కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలానికి చెందిన నక్కా నాగవంశీ(23), తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం శివారు నరేంద్రపురం గ్రామానికి చెందిన తంగెళ్ల రమేశ్‌కృష్ణ(27), పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన జంపని సాయిగోపి విహారి(26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. రాజేశ్ కైత్లాపూర్‌లో, మిగతా ముగ్గురు కేపీహెచ్‌బీ మూడో ఫేజ్‌లోని వసతి గృహాల్లో ఉంటున్నారు. కొంతకాలంగా వీరు గంజాయి తాగుతూ అనుమానం రాకుండా గంజాయిని తెల్ల కాగితాల్లో చుట్టి విక్రయిస్తున్నారు. రాజేశ్ తూర్పుగోదావరి జిల్లా నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తుంటాడు. బీటెక్ చదివే రోజుల్లోనే గంజాయికి అలవాటుపడ్డ రాజేశ్ మిగతావారికి అలవాటు చేశాడు. పోలీసులు నిందితుల నుంచి సుమారు 1300 గ్రాముల గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

రాజోలు
• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలి

కొత్తపేట న్యూస్‌టుడే: పట్టభద్రులంతా తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని కొత్తపేట శాసనసభ్యుడు బండారు సత్యానందరావు కోరారు. గురువారం అవిడి గ్రామంలో కొత్తపేట మండల నాయకులు, క్లస్టర్ ఇంఛార్జులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి పట్టభద్రులంతా సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కూటమి నాయకులు, క్లస్టర్, బూత్ ఇంఛార్జులు కలిసి పట్టభద్రులు ఓటు నమోదు చేసుకునేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి తాతాజీ, కంఠంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

అంబాజీపేట, మామిడికుదురు, న్యూస్‌టుడే: అంబాజీపేట మండలం ముక్కామల సబ్‌స్టేషన్ మోడేకుర్రు ఫీడర్ పరిధిలో ఉన్న గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎం.రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో చెప్పారు. కముజువారిలంక, శ్రీరామపురం, చినలంక, చిరతపూడి, కొత్తపేట మండలంలోని గొలకోటివారిపాలెం, మోడేకుర్రు గ్రామాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

★ మామిడికుదురులో విద్యుత్తు తీగలను ఆనుకుని ఉన్న చెట్ల ఆకులను తొలగించేందుకు మూడు గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. జగ్గన్నపేట, మొగలికుదురు, గెద్దాడలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

వ్యర్థాల తొలగింపు

రావులపాలెం గ్రామీణం: గోపాలపురంలో వ్యర్థాలు పలుచోట్ల పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వారి సమస్యను పంచాయతీ కార్యదర్శి నిమ్మకాయల సాయిరామ్ దృష్టికి తీసుకుని వెళ్లగా వెంటనే పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగించి దూరంగా తరలించారు.

వీధి దీపాల ఏర్పాటు

ఆత్రేయపురం: పులిదిండి గ్రామంలోని కొన్ని వీధుల్లో దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచి కనుమూరి సూర్యసుందర సీతారామకుమారి వద్ద ప్రస్తావించగా స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.

పైపులైనుకు మరమ్మతులు

మామిడికుదురు: మొగిలిపాలెం మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకుకు తాగునీటి సరఫరా అయ్యే పైపులైను ఆదుర్రు వంతెన వద్ద దెబ్బతినడంతో ఏర్పడిన సమస్యను ఆర్.డబ్ల్యు.ఎస్. ఏఈఈ జయశ్రీ వద్ద ప్రస్తావించగా వెంటనే స్పందించారు. పైపులైనుకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884

ధాన్యం ఆరబోతకు చోటేది?

పి.గన్నవరం నియోజకవర్గంలోని అయినవిల్లి, అంబాజీపేట, పి.గన్నవరం మండలాల్లో సుమారుగా 23 వేల ఎకరాల్లో అన్నదాతలు వరిసాగు చేపట్టారు. పంటకోసిన తరువాత ధాన్యంలో తేమశాతం తగ్గించేందుకు మూడు నుంచి నాలుగు రోజుల పాటు కల్లాల్లో ఆరబెట్టాల్సి ఉంటుంది. ఇటువంటి సమయంలో వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోతున్నారు. ఏటా మాసూళ్ల సమయంలో వర్షాలు వచ్చి ధాన్యం రాశులు, బస్తాలు తడిసి ముద్దవడంతో అవి మొలకలు వచ్చి నోటికాడ అందొచ్చిన పంట నీటిపాలవుతోందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. పంటను ఆరబెట్టుకునేందుకు వసతి, ధాన్యం నిల్వకు గోదాములు నిర్మిస్తే ఉపయుక్తంగా ఉంటుందని అంటున్నారు. గత అయిదేళ్ల పాలనలో వైకాపా ప్రభుత్వం ఈ సౌకర్యాలు కల్పించడంలో విఫలం కావడంతో అనేక కష్టాలు చవిచూడాల్సి వచ్చింది.

ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి దక్కించుకోవడం మరోఎత్తు. రబీ ధాన్యం కొనుగోళ్లకు అధికార యంత్రాంగం సమాయత్తం అవుతోంది. ఖరీఫ్ కోతలు మొదలయ్యే సమయానికి కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో సిద్ధం చేసే దిశగా చర్యలు చేపడుతున్నారు. మాసూళ్ల అనంతరం ధాన్యం ఆరబెట్టుకునేందుకు సరైన జాగా లేకపోవడంతో అన్నదాతలు ఏటా ఇబ్బంది పడుతున్నారు.
- న్యూస్‌టుడే, అయినవిల్లి

చినుకుపడితే తిప్పలే..

పంటనూర్పిళ్ల అనంతరం ధాన్యం అమ్ముకోవాలంటే కనీసం మూడు నుంచి నాలుగు రోజులు ఆరబెట్టాల్సి ఉంటుంది. తేమశాతం ఎక్కువగా ఉంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రాదు. ఆరబెట్టుకోవడానికి ఖాళీ స్థలాలు అందుబాటులో లేకపోవడంతో రహదారులు, లేఔట్లు.. ఇలా ఎక్కడ జాగా కనిపిస్తే అక్కడ రైతులు ధాన్యం ఆరబెట్టుకోవాల్సి వస్తోంది. ఇటువంటి సమయంలో అకస్మాత్తుగా వాతావరణం మారితే అన్నదాతలకు ఉరుకులు పరుగులు తప్పడం లేదు. ధాన్యం అమ్మే వరకు ఇంటిల్లిపాదికి కంటిమీద కునుకు ఉండదు. ఇన్ని కష్టాలు పడినా మిల్లులకు తరలిస్తే ఇంకా తేమశాతం ఉందని కొర్రీలు పెడుతూ కోత విధిస్తున్నారు మిల్లర్లు. గత వైకాపా పాలనలో రైతులు తిరిగి డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితులు కూడా చవిచూశారు.


ధాన్యం తడిసిపోకుండా కప్పిన బరకాలు (పాత చిత్రం)

అప్రమత్తంగా ఉండాలి...

పంట నూర్పిళ్ల అనంతరం ధాన్యం ఆరబెట్టే సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. మెరక ప్రాంతంలో రాశులు వేసుకోవాలి. ధాన్యం ఆరబెట్టేందుకు చిన్నపాటి డ్రై యంత్రాలు వచ్చాయి. వాటిని పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి రైతులకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటాం.
- షంషి, ఏడీఏ, అమలాపురం

అసంపూర్తి భవనాలు పూర్తి చేస్తాం: దేవ

సఖినేటిపల్లి: నాడు-నేడు పథకంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పాఠశాల భవనాలను పూర్తి చేస్తామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రామేశ్వరం జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. గత ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్‌లో ఈ భవనాలను నిర్మించిందని, వాటిని అసంపూర్తిగా వదిలేసి నిధులు పక్కదారి పట్టించిందన్నారు. అన్నింటిని పూర్తి చేస్తామని వెల్లడించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రుద్రరాజు పద్మరాజు, ఎంఈవో కిషోర్‌కుమార్, ఫణికుమార్, ముప్పర్తినాని పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి: బండారు

రావులపాలెం పట్టణం: కేబుల్ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం వెదిరేశ్వరం రోడ్డులోని కల్యాణ మండపంలో గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మల్టీ సర్వీసెస్ కేబుల్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మండలాల ఇన్‌ఛార్జులతో సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే బండారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో ఎన్నో అవస్థలు పడ్డామని వివరిస్తూ ఎమ్మెల్యేకు ఆపరేటర్లు వినతిపత్రం అందించారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకట్రావు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మామిడికుదురులో వాల్మీకి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

వాల్మీకి మహర్షికి పుష్పాంజలి

మామిడికుదురు, రావులపాలెం పట్టణం, అంబాజీపేట, న్యూస్‌టుడే: వాల్మీకి మహర్షి జయంత్యుత్సవాన్ని మామిడికుదురు రామాలయం కూడలి, పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. స్థానిక సర్పంచి గౌస్ మొహిద్దీన్, ఈలి శ్రీనివాస్, వార్డు సభ్యులు, విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

★ రామాయణాన్ని రచించి ప్రపంచానికి అందించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను రావులపాలెం డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

★ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను అంబాజీపేట మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు తదితరులు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


ఆలయ గోపురాన్ని శుద్ధ జలాలతో కడుగుతున్న సిబ్బంది

వాడపల్లిలో తిరుమంజన సేవ

వాడపల్లి(ఆత్రేయపురం): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 21 నుంచి 29 వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం తిరుమంజన సేవ నిర్వహించారు. అర్చకులు, అధికారులు, సిబ్బంది ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధాన ఆలయాన్ని, పరిసరాలను శుద్ధ జలాలతో కడిగారు. పూజా సామగ్రిని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమం తర్వాత దర్శనాలకు అనుమతించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షించారు.


ఆలమూరులో.. కొత్తపేట ఎమ్మెల్యే బండారు, ఇతర నాయకులు


మొగలికుదురులో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి...


సఖినేటిపల్లిలో ఎమ్మెల్యే దేవ...

'పల్లె పండగ'తో గ్రామాలకు పూర్వవైభవం

ఆలమూరు, మామిడికుదురు, సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమంతో గ్రామాలకు పూర్వవైభవం వస్తుందని కొత్తపేట శాసనసభ్యుడు బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు మండలంలో జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వంటిపల్లి పాపారావు, మెర్ల గోపాలం, ఈదల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

★ గ్రామాలు ప్రగతి పథంలోకి రావాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పల్లె పండగ వారోత్సవాల సందర్భంగా మొగలికుదురు సహా పదకొండు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. ఆయా గ్రామాల్లో రూ.2 కోట్ల నరేగా నిధులతో చేపట్టనున్న 39 సిమెంటు రహదారుల పనులకు భూమిపూజ చేశారు. ప్రజలతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు, తెదేపా, జనసేన, భాజపా మండల అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా, మెండా ఆదినారాయణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

★ నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లి, సఖినేటిపల్లి లంక, రామేశ్వరం గ్రామాల్లో గురువారం నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. సీసీరోడ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడుతూ జనవరి నాటికి గుంతలు లేని రోడ్లను ప్రభుత్వం నిర్మిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పెదకాపు, సర్పంచులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆహార దినోత్సవం

రాజోలు: రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఎన్.ఎస్.ఎస్.-1, 2 యూనిట్‌లు, వృక్ష, జంతుశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థినులు వివిధ రకాల పిండి వంటలు తయారు చేశారు. కళాశాలలో వాటిని విక్రయించడం ద్వారా వచ్చిన మొత్తాన్ని విద్యార్థుల రుసుముల నిమిత్తం ప్రిన్సిపల్ పి.సాయిబాబుకు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ పద్మనాభం, పీఆర్ఓ నల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై అభినందన

మలికిపురం: కెనరాబ్యాంకు విజయవాడ సర్కిల్ జనరల్ మేనేజర్‌గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సీజే విజయలక్ష్మిని విజయవాడలోని కార్యాలయంలో కలిసినట్లు మలికిపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాలకృష్ణరాజు గురువారం చెప్పారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఇటీవల కెనరాబ్యాంకు లక్కవరంలోని సరస్వతీ శిశుమందిర్ అభివృద్ధికి రూ.12 లక్షల సీఎస్ఆర్ నిధులు సమకూర్చడంపై కృతజ్ఞతలు తెలిపారు.


అంతర్వేదిలో దూసుకొస్తున్న కెరటాలు


తూర్పుపాలెంలో ముందుకొచ్చిన సముద్ర నీరు

సముద్రంలో ఎగసిపడిన అలలు

అంతర్వేది, మలికిపురం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో అంతర్వేది తీరంలో సముద్రం అలజడి సృష్టించింది. కెరటాలు 200 మీటర్లకు పైగా ముందుకొచ్చాయి. సమీప పల్లిపాలెం గ్రామంలోని ఇళ్ల వరకు నీరు చేరింది. గురువారం తెల్లవారుజాము నుంచి 7.30 వరకు రాత్రి 7.30 నుంచి 8.30 గంటల వరకు అలలు ఎగసిపడినట్లు స్థానికులు తెలిపారు. మలికిపురం మండలం తూర్పుపాలెం, గొల్లపాలెం గ్రామాల్లో సముద్రం 500 మీటర్ల మేర ముందుకు చొచ్చుకొచ్చింది. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం 9 గంటల వరకు కెరటాలు ముందుకు వస్తూనే ఉన్నాయని స్థానికులు చెప్పారు. దీంతో తూర్పుపాలెం-గొల్లపాలెం సరహద్దులోని బీచ్‌రోడ్డు మీదుగా తెప్పలవారి కోసం నిర్మించిన షెడ్‌ల వరకు నీరు వచ్చేసింది. . సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్న ఆక్వా చెరువులు మునిగాయి. ప్రస్తుతం తూర్పుపాలెం, గొల్లపాలెం వద్ద సముద్రం నిలకడగా ఉన్నట్లు మలికిపురం తహసీల్దారు టి.శ్రీనివాసరావు చెప్పారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధికారులు

పి.గన్నవరం: అమలాపురంలో పీఎంశ్రీ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు గురువారం జిల్లాస్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో పి.గన్నవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు లంకే అజేయుడు, శృంగవరపు బిందు ప్రథమ స్థానంలో నిలిచారని ప్రధానోపాధ్యాయుడు డి.యస్.వి.ప్రసాద్ తెలిపారు. వీరికి డిప్యూటీ కలెక్టర్ మధుసూదనరావు, జిల్లా విద్యాశాఖాధికారి కమలకుమారి ప్రశంసాపత్రాలు అందజేశారన్నారు. త్వరలో అమరావతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఈ విద్యార్థులు అర్హత సాధించారన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు



రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం స్వాగత వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు స్నేహభావంతో మెలగాలన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి అరుణ్‌కుమార్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటుపై అభ్యంతరం

మామిడికుదురు, న్యూస్‌టుడే: ఇళ్ల సమీపంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడంపై పాశర్లపూడి పరిధి బొమ్మిడిపాలెం ఆరోవార్డు వాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దుకాణానికి వచ్చే వారితో తమకు ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఇక్కడ ఉండే దుకాణంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అప్పట్లో దూర ప్రాంతానికి మార్పు చేశారని, తాజాగా అదేచోట పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై పంచాయతీ, అబ్కారీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఆర్థిక సాయం అందజేత

అయినవిల్లి, న్యూస్‌టుడే: విలస గ్రామం ప్రకాశ్ వారిపాలేనికి చెందిన బాలుడు బొక్కా హేమంత్ వైద్యచికిత్స నిమిత్తం గురువారం ముమ్మిడివరం శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్ మిత్రబృందం వాట్సాప్ గ్రూపు ద్వారా సేకరించిన రూ.25 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చెల్లిబోయిన శ్రీనివాసరావు, గొవ్వాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆమరణ దీక్షకు సిద్ధమైన అధ్యాపకులు

మలికిపురం, న్యూస్‌టుడే: జీతాల కోసం గత 37 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న మలికిపురం ఎమ్‌వీఎన్, జేఎస్, ఆర్‌వీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఆమరణ దీక్షకు సిద్ధమవుతున్నట్లు గురువారం చెప్పారు. పాలకవర్గం పట్టించుకోకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ దీక్షలో డిగ్రీ కళాశాల స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ముద్దల శ్రీను, నల్లి రాహుల్‌బాబు పాల్గొంటున్నారన్నారు.


లోక కల్యాణార్థం సుదర్శన యాగం

అంబాజీపేట, న్యూస్‌టుడే: లోక కల్యాణార్థం శ్రీరంగంలో త్రిషోశకుండాత్మక అష్టాక్షరీ సహిత మహా సుదర్శన యాగం గోపాలపురానికి చెందిన ఖండవిల్లి వేంకటసూర్య జగన్నాథాచార్యుల ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైనట్లు చిరతపూడికి చెందిన అంగర వెంకటసత్యశ్రీనివాస్ స్థానిక విలేకర్లకు చెప్పారు. మూడు రోజుల పాటు జరిగే ఈ యాగం ఈ నెల 19న ముగుస్తుందన్నారు.

సైఫన్ల నిర్మాణానికి రూ.2.92 కోట్లు మంజూరు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురం మండలంలోని లొల్ల, మెర్లపాలెం, వాడపల్లి, ర్యాలి తదితర గ్రామాల రైతులకు పంటపొలాల ముంపు సమస్య లేకుండా ఉండేందుకు వీలుగా రెండు సైఫన్‌లు నిర్మించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. బ్యాంక్ కెనాల్, అమలాపురం కెనాల్ వెంబడి ఉన్న పొలాలు వర్షాలకు తరచూ ముంపుబారిన పడుతుండేవి. గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి వెళ్లడం తప్ప ఎటువంటి నివారణ చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం సమస్యను గుర్తించిన కూటమి ప్రభుత్వం ఇందుకోసం రూ.2.92 కోట్లు మంజూరు చేసింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో లొల్ల గ్రామ సర్పంచి కాయల జగన్నాథరావు తదితర రైతులు సమస్యను బండారు సత్యానందరావు దృష్టికి తీసుకొచ్చారు. ఆయన పరిశీలించి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఆ హామీ ప్రకారం చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు.

బోర్డు తీయరు.. ఇదేం తీరు!



మామిడికుదురు మండలం నగరం సచివాలయం-2 కార్యాలయంపై గత వైకాపా ప్రభుత్వానికి చెందిన నవరత్నాల బోర్డును ఇప్పటికీ అలానే ఉంచేయడంతో స్థానికులు పలువురు పంచాయతీ అధికారుల తీరుపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీనిని తొలగించడంలో తాత్సారం దేనికని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని కార్యదర్శి పీఎస్‌పీ ప్రసాద్ దృష్టికి గురువారం తీసుకువెళ్లగా వెంటనే దానిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

ప్రజా సమస్యలపై సభ్యుల నిలదీత


సమస్యలు వివరిస్తున్న సర్పంచి జయలక్ష్మి

కొత్తపేట, న్యూస్‌టుడే: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ మార్గాని గంగాధర్ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. వివిధ సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. కొత్తపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కౌసిక డ్రైయిన్‌లో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని సర్పంచి భూసి జయలక్ష్మి వివరించారు. మంచినీటి పైపులైన్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు జి.రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు పల్లి శాంతి, రెడ్డి శ్రీనివాస్, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత... రాకపోకలకు చింత



ముక్తేశ్వరం నుంచి కొండాలమ్మచింత వరకు ర.భ.శాఖ ప్రధాన రహదారిని గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. కె.జగన్నాథపురం వరకు పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాటిల్లో వర్షంనీరు నిలిచి చెరువులుగా మారి ప్రమాదాలకు నిలయంగా మారాయి. సమీప గ్రామాల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. ఈ రోడ్డు మరమ్మతులకు రూ.1.25 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని, మంజూరైతే పనులు చేపడతామని ర.భ.శాఖ జేఈ రమేష్ తెలిపారు.
– న్యూస్‌టుడే, అయినవిల్లి

దుర్గా రూపిణి.. జగజ్జననీ

మామిడికుదురు: పెదపట్నంలంక కనకదుర్గమ్మ ఆలయ 33వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. 108 కలశాలతో మహిళలు మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చిన నదీజలాలను అర్చకులు అమ్మవారికి అభిషేకించారు. లక్ష కుంకుమార్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఘనంగా దుర్గామాత ఊరేగింపు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురం మండలం ర్యాలి గుడిమెరక వీధిలో దేవీ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు.

సమష్టిగా పోరాటం: కొండేటి

మామిడికుదురు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై పోరాడే సత్తా వైకాపాకు ఏమాత్రం లేదని, కాంగ్రెస్ పార్టీకే ఆ యోగ్యత ఉందని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. నగరంలో గురువారం జరిగిన పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని, ఇవి అమలయ్యే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో అధికారాన్ని సాధించడమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, నాయకులు మహ్మద్‌ఆరిఫ్, మాచవరపు శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాడైన విద్యుత్తు పరికరాలు

అయినవిల్లి, న్యూస్‌టుడే: గురువారం తెల్లవారుజాము వరకు ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి మండలంలోని అయినవిల్లి, వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక తదితర గ్రామాల్లో విద్యుత్తు పరికరాలు పాడైనట్లు పలువురు వాపోయారు. తీగలపై చెట్ల కొమ్మలు, కొబ్బరి ఆకులు పడిపోవడంతో విద్యుత్తు సరఫరాకు ఆటంకం ఏర్పడింది. అధికారులు గుర్తించి పనులు చేపట్టి సరఫరా పురుద్ధరించారు.

శిథిల భవనాల్లో ఆశ్రయం ఎలా?

రాజోలు మండలం కడలిలో ఉన్న తుపాను ఆశ్రయ భవనం శిథిల స్థితికి చేరి నిరుపయోగంగా మారింది. తుపాన్లు, విపత్తుల సమయాల్లో బాధితులకు ఆశ్రయం కల్పించాల్సిన ఈ భవనం నేడు పశువులకు ఆవాసంగా మారిపోయింది. 1986లో నిర్మించిన ఈ భవనంపై ప్రస్తుతం పనికిరాని మొక్కలు మొలిచాయి. స్లాబు పెచ్చులు ఊడి కూలడానికి సిద్ధంగా ఉంది. ఈ దుస్థితిపై 2022లో జాతీయ ప్రకృతి విపత్తుల నిర్వహణ కమిటీకి అప్పటి తహసీల్దార్ నివేదిక సమర్పించారు. ఇప్పటివరకు కార్యాచరణ చేపట్టలేదు.

★ కాట్రేనిపాడులంకలో ఉన్న భవనాన్ని పలు సమస్యలు వెంటాడుతున్నాయి. దీనికి మరుగుదొడ్లు పాడయ్యాయి. తలుపులు విరిగిపోయాయి. విద్యుత్తు సదుపాయం లేదు. తాగునీటి ట్యాంకు పాడైంది. మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.

★ రాజోలు మధ్యలంకలో ఉన్న భవనం తలుపులు పాడయ్యాయి. మరుగుదొడ్లు ధ్వంసం అయ్యాయి. ఈ భవనానికి పశ్చిమగోదావరి జిల్లా లక్ష్మీపురం నుంచి విద్యుత్తు సరఫరా అవుతుంది. వరదల సమయంలో విద్యుత్తు స్తంభాలు పాడవుతుండటంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన విద్యుత్తు టవర్లు నిర్మించాలని స్థానికులు, రైతులు చాలాకాలం నుంచి కోరుతున్నారు.

తుపాన్లు, ప్రకృతి విపత్తుల సమయాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాల్సిన భవనాలు శిథిల స్థితికి చేరాయి. వీటి నిర్వహణను గత పాలకులు పూర్తిగా విస్మరించడంతో ఈ దుస్థితి ఏర్పడింది. వీటిల్లో కొన్నిచోట్ల పశువులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. మరికొన్ని భవనాలు పూర్తిగా పాడై నిరుపయోగంగా మారాయి.
– న్యూస్‌టుడే, రాజోలు


కడలిలో కూలేందుకు సిద్ధంగా ఉన్న తుపాను ఆశ్రయ భవనం

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

కడలిలో ఉన్న భవనాన్ని పూర్తిగా తొలగించేందుకు, కాట్రేనిపాడులంక, రాజోలు మధ్యలంకల్లో ఉన్న భవనాల మరమ్మతులకు అంచనాలు రూపొందించి జాతీయ ప్రకృతి విపత్తుల నిర్వహణ కమిటీకి ప్రతిపాదనలు పంపాం. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాగానే కార్యాచరణ చేపడతాం.
– ఎన్ఎస్ఎస్ ప్రసాద్, తహసీల్దారు, రాజోలు

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మునిస్వామి తదితరులు

శ్రీకృష్ణదేవరాయుల వర్ధంతి

యానాం, న్యూస్‌టుడే: యానాంలో శ్రీకృష్ణ దేవరాయుల వర్ధంతిని గురువారం నిర్వహించారు. ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, కమిషనర్ రామకృష్ణలు దేవరాయుల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం ఉన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఉప్పలగుప్తం: మండలంలోని పలు ఉపకేంద్రాల పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రవికుమార్ తెలిపారు. ఆయా కేంద్రాల పరిధిలోని ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, భీమనపల్లి, నంగవరం, సుధాపాలెం, విలసవిల్లి, భట్లుపాలెం, సింగరాయపాలెం, మునిపల్లి, పెదగాడవిల్లి, చినగాడవిల్లి, సన్నవిల్లి, వానపల్లిపాలెం, ఎస్.కొత్తపల్లి, రాఘవులపేట, చీకట్లపాలెం, చల్లపల్లి, ఎస్. యానాం, వాసాలతిప్ప గ్రామాలకు విద్యుత్తు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో కోరారు.

అల్లవరం: దేవగుప్తం ఉప విద్యుత్తు కేంద్రం పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. రహదారి పనులు నిమిత్తం స్తంభాలు మార్పు చేస్తున్న కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 గం. నుంచి మ. ఒంటి గంట మధ్య

అమలాపురం: 79811 19595, ముమ్మిడివరం: 80085 74166

ట్యాంకు శుభ్రం

సమస్య: కాట్రేనికోనలోని గచ్చకాయలపోరలో తాగునీటి ట్యాంకు లోపల నాచు పట్టింది. అధికారులు ట్యాంకును శుభ్రం చేసే పనులు చేపట్టాలి. - సూర్య, స్థానికుడు

పరిష్కారం: సమస్యను సర్పంచి సుధాకర్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందితో ట్యాంకును బ్లీచింగ్‌తో కడిగించారు.

పైపులైన్లకు మరమ్మతులు

సమస్య: కాట్రేనికోనలో తాగునీటి పైపులైన్లు లీకవుతున్నాయి. మరమ్మతులు చేపట్టాలి. - గ్రామస్థులు

పరిష్కారం: సమస్యని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్రహ్మణ్యంకు తెలుపగా స్పందించారు. సిబ్బందితో పైపులైనుకు మరమ్మతులు చేయించారు.

– న్యూస్‌టుడే, కాట్రేనికోన



సమస్య: అమలాపురంలోని యర్రమిల్లివారి వీధిలో రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు పడవేస్తున్నారు. ఇక్కడ చెత్త వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలి. -నాయుడు, వ్యాపారి



సమస్య: అమలాపురంలోని గొల్లగూడెం బైపాస్‌రోడ్డు మురుగుకాలువలో పూడికలు తొలగించడం లేదు. -పండు, స్థానికుడు

–న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

వానొస్తే చింత.. నిత్యం అవస్థ

జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు తప్పని తిప్పలు

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం, ముమ్మిడివరం, ఉప్పలగుప్తం

ఇళ్లు కాదు.. ఊళ్లు కడుతున్నామని గత పాలకులు ఊదరగొట్టారు. పేదలకు పెద్ద ఎత్తున స్థలాలు పంపిణీ చేశామని గొప్పలు చెప్పారు. తీరా చూస్తే కనీస వసతులు కల్పించకపోవడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పని పరిస్థితి జగనన్న కాలనీల్లో కనిపిస్తోంది. కనీసం అంతర్గత రహదారులు, మురుగుకాలువలు, తాగునీరు తదితర వసతులు ఏర్పాటు చేయకపోవడంతో అవస్థలు తప్పడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

అమలాపురం మండలం ఎ.వేమవరంలోని జగనన్న కాలనీ ఇది. రహదారి అస్తవ్యస్తంగా ఉంది. చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతోంది. గత ప్రభుత్వ హయాంలో కనీస మౌలిక వసతులు కల్పించకపోవడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.



ఎ.వేమవరంలోని జగనన్న కాలనీలో ఛిద్రంగా రహదారి



కిత్తనచెరువులో జగనన్న కాలనీ దుస్థితి

ఉప్పలగుప్తం మండలం కిత్తనరువులో జగనన్న కాలనీలో వంద మందికి పైగానే లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు ఇచ్చారు. ఇక్కడ ఇరవై మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా.. అందులో పది వరకు మాత్రమే పూర్తయ్యాయి. రహదారులు, తాగునీటి సదుపాయం, మురుగు కాలువల వ్యవస్థ లేకపోవడంతో వారూ ఇబ్బందులు పడుతున్నారు.

అమలాపురంలో అవస్థలే..!

అమలాపురం గ్రామీణం, పట్టణం, అల్లవరం,

అంశం	అమలాపురం	ముమ్మిడివరం
గ్రామాలు	60	63
లేఔట్లకు కొన్న భూమి	120 (ఎకరాలు)	135
లేఔట్లు	37	46
మెరక వేయనివి	11	21
మొత్తం ప్లాట్లు	3,232	3654

ఉప్పలగుప్తం మండలాల పరిధిలో నాలుగేళ్ల క్రితం జగనన్న కాలనీలకు సంబంధించి లే ఔట్లను అభివృద్ధి చేసే పనులు ప్రారంభించారు. ఆ తర్వాత దశల వారీగా లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు అందించడంతో ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. నియోజకవర్గంలో 37 లేఔట్లు ఉండగా.. ఇప్పటికీ 11 లేఔట్లను మట్టితో కప్పే పనులు చేపట్టలేదంటే గత ప్రభుత్వ తీరును ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ప్రధానంగా మట్టి లభ్యం కావడం లేదనే కారణాలతోనే గత నాలుగేళ్ల నుంచి 11 లేఔట్లలో పనులు నిలిచిపోయాయి. ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

ముమ్మిడివరంలో..



ముమ్మిడివరంలోని కాలనీలో ఇలా..

నియోజకవర్గంలో 46 లేఔట్లలో 3,654 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఈ కాలనీల్లో చాలా వరకు రహదారులు లేవు. మెరక పనులు చేయలేదు. రహదారులు నిర్మించలేదు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన సామగ్రి తీసుకెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. వర్షపునీరు సైతం బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సైతం సక్రమంగా వినియోగించలేని పరిస్థితి నెలకొంది. మెటీరియల్ కాంపోనెంట్ నిధులను భవన నిర్మాణాలకు మాత్రమే కేటాయించి రహదారులు, మురుగుకాలువలను విస్మరించిన తీరు కనిపిస్తోంది.

ఆదేశాలు రాలేదు

జగనన్న కాలనీల్లో గతంలో నిర్మించిన రహదారులు, కల్వర్టులకు బిల్లులు చెల్లించాలి. ప్రస్తుతం కాలనీల్లో మౌలిక వసతులకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.

- పి.ఎస్.రాజ్‌కుమార్, డీఈఈ, పంచాయతీరాజ్, అమలాపురం



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న బండారులంక గ్రామస్థులు

డంపింగ్ యార్డు తొలగించాలని నిరసన

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: బండారులంకలోని శివాలయం వద్ద ఉన్న డంపింగ్ యార్డును తొలగించాలని గ్రామస్థులు గురువారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. కౌశిక డ్రెయిన్‌కు ఆనుకుని పంచాయతీ అధికారులు చెత్తను పారబోస్తున్నారని, దీనికి ఎదురుగా శ్మశాన వాటిక ఉండటంతో అంత్య క్రియల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గతంలో నిరసన తెలపగా అధికారులు చెత్తను అమలాపురం బైపాస్ రోడ్డులోని డంపింగ్ యార్డుకు తరలించారన్నారు. ప్రస్తుతం చెత్త కొండలా పేరుకు పోయి దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తక్షణం డంపింగ్ యార్డు స్థలాన్ని మార్పు చేయడంతో పాటు చెత్తను పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. సర్పంచి పెనుమాల సునీత, గ్రామస్థులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో చండీహోమంను గురువారం ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి తిథిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం చేశారు. ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముమ్మిడివరం: స్థానిక శ్రీ ఉమా సూర్యేశ్వరస్వామి ఆలయంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గురువారం నవ చండీహోమం నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రులు ముగిసిన తర్వాత పౌర్ణమి తిథిని పురస్కరించుకుని ఆలయం వద్ద శాస్త్రోక్తంగా చండీహోమాన్ని నిర్వహించారు.



చండీహోమం క్రతువులో అర్చకులు



శ్రీబాలాత్రిపుర సుందరిదేవి



గజవాహనంపై స్వామిని ఊరేగిస్తున్న గ్రామస్థులు

అమలాపురం పట్టణం: పౌర్ణమి సందర్భంగా అమలాపురం పట్టణంలోని కాలేజీరోడ్డులో బాలాత్రిపుర సుందరిని గురువారం పూలతో అలంకరించారు. పంచామృతాలు, వివిధ పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. మహిళలు లక్ష కుంకుమార్చన చేశారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు.

బేతాళస్వామి గ్రామోత్సవం

ఉప్పలగుప్తం: చల్లపల్లిలోని బేతాళస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. డప్పువాయిద్యాలు, గరగ నృత్యాలు, వివిధ నృత్య ప్రదర్శనలు మధ్య స్వామివారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాలు తిలకించారు.

కూటమితోనే గ్రామాల అభివృద్ధి

కాట్రేనికోన: కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలో రూ.2.82 కోట్ల ఉపాధి హామీ నిధులతో 48 ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, దాట్ల పవన్, వెంకటేశ్వరరావు, చక్రధర్, బాబురావు, సురేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



పెనుమల్లలో ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతి

కాట్రేనికోన: సొసైటీ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు వై.రామచంద్రరావు ఆధ్వర్యంలో సభ్యులు గురువారం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుకు వినతిపత్రం అందించారు. తమ డిమాండ్లను వినతిలో పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకువెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వారికి స్థిరాస్తి.. వీరికి తిప్పలు

పట్టణంలో ఖాళీ స్థలాలతో జనం కష్టాలు

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

పట్టణంలోని ఖాళీ స్థలాలు యజమానులకు ఆదాయ వనరులుగా మారుతున్నాయి. పురపాలక సంఘానికి పన్నుల రూపంలో ఆదాయం వస్తోంది. చివరకు అక్కడి ప్రజలకు మాత్రం కష్టాలు తప్పడం లేదు. పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు పెరిగి అడవుల్ని తలపిస్తున్నాయి. వాటిలో స్థానికులు చెత్త, నిరుపయోగ గృహోపకరణాలు వేస్తుండటంతో డంపింగ్‌యార్డులుగా మారుతున్నాయి. ఆ ప్రాంతాలు పందులు, కుక్కలకు ఆవాస స్థానాలుగా మారుతున్నాయి. సమీప రోడ్లపై వెళ్లేందుకు జనం ఇబ్బంది పడుతున్నారు. అక్కడ దోమలు వృద్ధి చెందుతున్నాయి.

ఈ ప్రాంతాల్లో..

అమలాపురం పట్టణంలో హౌసింగ్ బోర్డుకాలనీ, నల్లవంతెన, ఎర్రవంతెన, కె.అగ్రహారం, సావరంరోడ్డు, భూపయ్యఅగ్రహారం, సూర్యనగర్, కొంకాపల్లి రోడ్డులలో ఖాళీస్థలాలు ఎక్కువగా ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో కొనుగోలు చేసి ఖాళీగా వదిలేశారు. అలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

రోగ కారణాలు..

ఖాళీ స్థలాల్లో మొక్కలు గుబురుగా ఉండటంతో విషసర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ స్థలాలు పల్లంగా ఉండటంతో వర్షపునీరు చేరి మురుగు గుంతలుగా మారుతున్నాయి. అందులోని చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో పొగ వ్యాపిస్తోంది.

పన్ను బకాయిలు.. రూ.2.72 కోట్లు

పట్టణంలో 2,123 ఖాళీస్థలాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వైకాపా ప్రభుత్వం ఈ ఖాళీస్థలాల గురించి పట్టించుకోలేదు. దీంతో వీరు చెల్లించవలసిన పన్ను బకాయిలు రూ. 2.72 కోట్లకు చేరాయి. సుమారు 300 స్థలాల యజమానులు చిరునామా అధికారులకు తెలియకపోవడం గమనార్హం. గుర్తించిన వాటికైనా పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేయడం లేదు. కొంతమంది స్థల యజమానులకు నోటీసులు జారీ చేసినా స్పందించడం లేదు.



అమలాపురంలోని మార్కెట్‌లో ఖాళీస్థలంలో ప్లకార్డును పెడుతున్న సిబ్బంది

ఇవీ వివరాలు..

పట్టణం	: అమలాపురం
వార్డులు	: 30
జనాభా	: 65వేలు
ఖాళీ స్థలాలు	: 2,123
పన్ను బకాయి	: 2.72 కోట్లు
ఈ ఏడాది వసూలు	: రూ.26.35 లక్షలు



అమలాపురంలోని అశోక్‌నగర్ ఖాళీస్థలంలో వర్షంనీరు చేరి ఇలా..

శుభ్రం చేసుకోవాలి..



పట్టణంలో వివిధ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలపై ప్రత్యేక దృష్టి సారించాం. మున్సిపల్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశాం. వివిధ ప్రాంతాల్లో స్థలాలను ఖాళీగా వదిలేసిన వారికి నోటీసులు జారీ చేస్తున్నాం. ఎవరికి వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ స్థలాల్లో పిచ్చిమొక్కలు, నీటిని తొలగించి శుభ్రం చేసుకోవాలని కోరుతున్నాం.

- భూపతి శ్రీలక్ష్మి, రెవెన్యూ అధికారిణి, అమలాపురం పురపాలక సంఘం

లోతట్టు ప్రాంతాలు జలమయం

కాట్రేనికోన: ఎడతెరిపి లేని వర్షాలతో మండలంలో పల్లపు ప్రాంతాలన్నీ జలమయం అవుతున్నాయి. గురువారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో విద్యుత్తు సరఫరాకి గంటలతరబడి అంతరాయం ఏర్పడింది. కందికుప్పలోని పొన్నాడవారిగట్టులో ఇళ్లచుట్టూ నీరు చేరింది. కాట్రేనికోన, చెంచులగరువు సహా పలు చోట్ల గుంతల రోడ్లపై నీరు నిలిచింది. మగసానితిప్ప నుంచి గచ్చకాయలపోర వరకు ఉన్న సముద్రతీరం అల్లకల్లోలంగా మారింది.



పొన్నాడవారిగట్టులో ఇళ్లచుట్టూ చేరిన నీరు

మద్యం దుకాణం తొలగించాలి

అల్లవరం: అల్లవరం పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారికి ఆనుకుని ఏర్పాటు చేసిన మద్యం దుకాణం తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఇటీవల మద్యం దుకాణాల కేటాయింపులో భాగంగా అల్లవరం నుంచి ఎంట్రుకోన వెళ్లే దారిలో రోడ్డు పక్కన ఏర్పాటు చేశారు. దీని చుట్టూ నివాసాలు ఉండటం, ఈ రోడ్డు చిన్నగా ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడతాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఆర్డీవో మాధవికి వినతి పత్రాలు అందజేశారు.

వ్యాన్ అదుపుతప్పి డ్రైవర్ మృతి

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం అనాతవరం-భీమనపల్లి రోడ్డులో ఐచర్ వ్యాన్ గురువారం అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన ఘటనలో డ్రైవర్ మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. అనాతవరం శివారు వడ్డివారిపేటకు చెందిన వీరా శ్రీనివాసరావు(39) వ్యానులో కొబ్బరికాయల లోడును దింపి తిరిగివస్తుండగా.. అనాతవరం-భీమనపల్లి రోడ్డులోని దంగేటివారిపాలెం సమీపంలో వాహనం అదుపుతప్పి డ్రెయిన్‌లోకి దూసుకువెళ్లింది. దీంతో వ్యాన్‌లో ఇరుక్కుపోయి శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మావతి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపారు.

దొంతికుర్రులో విషాదఛాయలు

కాట్రేనికోన: హైదరాబాద్‌లోని జీడిమెట్లలో ప్రమాదవశాత్తు రసాయనాల ట్యాంకులో పడి కవల సోదరులు వస్కా రామ్, లక్ష్మణ్‌లు బుధవారం మృతి చెందడంతో స్వగ్రామమైన దొంతికుర్రులోని కోతులచెరువులో విషాదఛాయలు అలముకున్నాయి. వస్కా సత్యనారాయణ, సత్యవతి దంపతుల నలుగురి సంతానంలో రెండో సంతానమైన వీరిద్దరూ జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. వీరి తల్లి గతంలో మరణించగా తండ్రి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రామ్, లక్ష్మణ్ మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తిచేశారని శుక్రవారం స్వగ్రామానికి చేరుకుంటాయని స్థానికులు తెలిపారు. అందరితో కలివిడిగా ఉండే అన్నదమ్ములిద్దరూ ఒకేసారి మృతి చెందడంతో బంధువులు, స్థానికులు విషాదంలో మునిగారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

అమలాపురం పట్టణం: ప్రైవేటు వ్యక్తుల వద్ద వ్యాపారం నిమిత్తం తీసుకున్న అప్పు విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగి భార్య ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎస్ఎస్ నాయుడు లే అవుట్‌కు చెందిన భార్యాభర్తలు గురువారం అప్పు విషయంలో ఇంట్లో గొడవ పడ్డారు. ఆ సందర్భంగా భార్య పురుగు మందు తాగి స్పృహతప్పి పడిపోయింది. ఆమెను అంబులెన్స్‌లో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పట్టణ ఎస్ఐ కిషోర్ బాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించారు.

రోడ్లపై పడిన చెట్లు తొలగింపు

కాట్రేనికోన: ఈదురుగాలులు, వర్షాల ప్రభావంతో మండలంలో బంటుమిల్లి సహ పలుచోట్ల విద్యుత్తు తీగలు, రోడ్లపై పడిన చెట్లను సంబంధిత అధికారులు తొలగింపచేశారు. పాడైన విద్యుత్తు తీగలకు గురువారం మరమ్మతులు చేపట్టారు.



విజేతలతో జిల్లా అధికారులు

విద్య వైభవ్ పోటీలు

అమలాపురం పట్టణం: జిల్లాలో 26 పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి విద్య వైభవ్ పోటీలను నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎం.కమలకుమారి తెలిపారు. అమలాపురంలోని జడ్పీ బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని వి.విజయకుమారి అధ్యక్షతన గురువారం పోటీలు జరిగాయి. ఒలింపిక్ యాడ్, మంథన్ మండల్, డిజిటల్ క్వెస్ట్, డిస్కవరీ లెర్నింగ్, లోకల్ సైట్స్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ. మధుసూదన్‌రావు, డీవైఈవో సూర్యప్రకాశరావు, ఎస్.రాజరాజేశ్వరి, పి. రాంబాబు, బీవీవీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గోపీమూర్తి విజయానికి కృషి చేయాలి

ఐ.పోలవరం: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గానికి యూటీఎఫ్, పలు ఉపాధ్యాయ, ఉద్యోగ, ప్రజాసంఘాలు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసిన బొర్రా గోపీమూర్తి విజయానికి అంతా సహకరించాలని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు కోరారు. మురమళ్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో గురువారం ఆయన సమావేశమై ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. శ్రీనివాసరావు, టి.దుర్గాప్రసాద్, విబికె వివిఎస్.శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశీలన

యానాం, న్యూస్‌టుడే: యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో 18 నెలల చిన్నారికి కాలం చెల్లిన ద్రావణం ఇచ్చిన అంశం వివాదాస్పదమైన నేపథ్యంలో పరిపాలనాధికారి మునిస్వామి గురువారం ఆసుపత్రిని తనిఖీ చేశారు. వైద్యుల విభాగాలతో పాటు, మందుల పంపిణీ విభాగాన్ని ఆయన పరిశీలించారు. డీడీ రవిశంకర్, జేఏఓ కుమార్ తదితరులు ఉన్నారు.



బీసీ బాలికల వసతి గృహంలో దస్త్రాలను పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రహంతుల్లా

వసతి గృహాల ఆకస్మిక తనిఖీ

ముమ్మిడివరం: ముమ్మిడివరంలోని సాంఘిక సంక్షేమ శాఖ బీసీ బాలుర, బాలిక కళాశాల వసతి గృహాలను జేఎఫ్‌సీఎం కం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి మహ్మద్ రహంతుల్లా గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం, జిల్లా కోర్టు ఆదేశాల మేరకు వసతి గృహాలను పరిశీలించి అక్కడ వసతులను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత దస్త్రాలను పరిశీలించారు.

ప్రజాపనుల ఉద్యోగుల ఆందోళన

యానాం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య కార్యదర్శి కర్రి నాగబాబు ఆధ్వర్యంలో యానాంలోని ప్రజాపనుల శాఖ ఈఈ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. ఆ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనాకారులు తమ డిమాండ్లను విజ్ఞప్తి చేశారు. సీఐ షణ్ముగం, ఎస్సై మురుగనందన్ ఆధ్వర్యంలో పోలీసులు ఆందోళనాకారులతో మాట్లాడారు.



ఆందోళన నిర్వహిస్తున్న ఉద్యోగులు

తీరంలో ఆక్వా రైతుల అష్టకష్టాలు

తుపాను ప్రభావంతో సముద్రం ఉప్పొంగడంతో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోయారు. రాత్రికి రాత్రే చెరువులను ముంచెత్తడంతో ఘొల్లుమన్నారు. చెరువుల్లోని చాలా వరకు రొయ్యలు కొట్టుకుపోయాయి. మిగిలిన వాటిని అప్పటికప్పుడు పట్టుబడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చెరువులు వద్దనే ఉన్నారు.

– న్యూస్‌టుడే, అల్లవరం





హడావుడిగా పట్టుబడి చేస్తున్న రైతులు


మంత్రి లోకేష్‌కు చెక్కు అందజేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వరద బాధితులకు చేయూత

రాయవరం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయం కోసం రాయవరం సాయివిద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు రూ.4.25లక్షలు సేకరించారు. ఈ చెక్కును పాఠశాల డైరెక్టరు కర్రి సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉండవల్లిలో ఐటీ మంత్రి నారా లోకేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంత్రి అభినందించినట్లు తెలిపారు.

మండపేట

• మండపేట • రామచంద్రపురం

ఇసుక ర్యాంపుల పరిశీలన

అంగర: కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లి, తాతపూడి, కేదార్లంక, కపిలేశ్వరపురం, నారాయణలంక ఇసుక రీచ్‌లను ఆర్డీవో కబీట్ కౌసర్ బానో గురువారం పరిశీలించారు. గతంలో ర్యాంపుల నిర్వహణ తీరు, వాటి పరిస్థితులను తహసీల్దార్ పి.చిన్నారావు ఆర్డీవోకు వివరించారు. త్వరలో ఇసుక ర్యాంపులను అందుబాటులోకి తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తున్న సందర్భంగా రీచ్‌లను పరిశీలించినట్లు తెలిపారు. ఆమె వెంట రెవెన్యూ, మైన్స్, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో



వంతెన బాగు మరిచారు

ఏడిద సీతానగరం- వెలగతోడును కలిపే నీటిపారుదలశాఖకు చెందిన వంతెనపై నిర్లక్ష్యం అల్లుకుంటోంది. సంబంధిత శాఖ సిబ్బంది, అధికారులు వంతెన బాగును పట్టించుకోకపోవడంతో వంతెన చుట్టూ పిచ్చిమొక్కలు, రావిమొక్కలు మొలిచాయి. రోజూ వందలాది వాహనాలు ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తుంటాయి. ఎందరికో ఉపయోగపడే ఈ వంతెన విషయమై అధికారులు దృష్టిసారించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. దీనిపై నీటిపారుదలశాఖ జేఈ అజీజ్‌ను వివరణ కోరగా చుట్టూ అల్లుకున్న తుప్పలను, పొదలను శుభ్రం చేసేందుకు లస్కర్లుకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. వంతెన నిర్వహణకు సంబంధించి ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

ఆస్తులున్నా.. ఆదాయం లేదు

• అభివృద్ధికి దూరంగా అమ్మవారి ఆలయాలు

మండపేట, న్యూస్‌టుడే: మండపేట పట్టణంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు పూజిస్తున్న ఎల్లారమ్మ, కనకమహాలక్ష్మమ్మ ఆలయాల్లో ఉత్సవాలకు నిధుల కొరత సమస్యగా మారింది. పూర్వ కాలంలో మశూచి, అమ్మవారు వంటి అంటువ్యాధులు ప్రబలితే ప్రజలంతా గ్రామదేవతలకు పూజలు చేసి మొక్కులు సమర్పించుకునేవారు. మొక్కుల రూపంలో కొందరు భక్తులు పంట భూములు విరాళంగా సమర్పించారు. రూ.కోట్లు విలువ చేసే స్థిరాస్తులపై ఆదాయం లేక ఉత్సవాలు మాత్రం నామమాత్రంగా మారుతున్నాయి.


ఎల్లారమ్మ, కనకమహాలక్ష్మమ్మ ఆలయం

అమ్మవార్ల ఆస్తుల వివరాలిలా

స్థానిక కలువపువ్వు సెంటరులో మార్కెట్ వద్ద ఎల్లారమ్మ, కనకమహాలక్ష్మమ్మ ఆలయాలకు సంబంధించి ఏడిద రోడ్డులో రోడ్డును ఆనుకుని ఎకరం రూ.3 కోట్లు విలువ చేసే భూములు 15.78 ఎకరాలు ఉన్నాయి. ప్రస్తుతం 8.89 ఎకరాలపై మాత్రమే ఏడాదికి రూ.2.06 లక్షలు ఆదాయం సమకూరుతోంది. మిగిలిన 5.84 ఎకరాల భూమిలో 2.88 ఎకరాలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కళాశాలలకు 1951లో స్వాధీనం చేశారు. దశాబ్దంన్నర క్రితం 1.46 ఎకరాల స్థలాన్ని ఆర్టీసీకి స్వాధీనం చేయగా దాతల సహకారంతో బస్టాండ్ నిర్మించారు. భూమికి సంబంధించి రూ.7.4లక్షలు పరిహారం ప్రభుత్వం చెల్లించింది. మిగిలిన భూమిలో 9 సెంట్ల స్థలంలో పోలేరమ్మ ఆలయం, 8 సెంట్లలో పాపమ్మ పేరంటాళ్లమ్మ ఆలయం నిర్మించారు. ఈ ఆలయాలు ప్రైవేటు వ్యక్తుల చేతిలో ఉన్నాయి. రోడ్డు వారగా ఉన్న 85 సెంట్లు స్థలాన్ని ఆసాదులు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నారు. స్థలంలో కొంత భాగంలో దుకాణాలు నిర్మించుకుని అద్దె వసూలు చేసుకుంటుండగా దేవాదాయ శాఖ అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇళ్ల నిర్మాణానికి దేవాదాయ శాఖ అనుమతులు లేకపోవడంతో ఆ స్థలాన్ని ఖాళీ చేయాలంటూ గతంలోనే అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో నామమాత్రంగా 85 సెంట్లు స్థలానికి నెలకు కేవలం రూ.866 మాత్రమే చెల్లిస్తున్నారు. కమర్షియల్ అవసరాలకు బహిరంగ వేలం నిర్వహించినా నెలకు రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతుందని అధికారులు భావిస్తున్నారు.


రోడ్డును ఆనుకుని ఆసాదుల నివాసాలు

లీజు క్రమబద్ధీకరణ చేయాలి..

స్థానిక ఏడిద రోడ్డులో రోడ్డును ఆనుకుని ఉన్న ఎల్లారమ్మ, కనకమహాలక్ష్మమ్మ ఆలయాలకు చెందిన 85 సెంట్లు భూమిలో దశాబ్దాలుగా ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్నారు. వీరు దేవాదాయ శాఖకు అతి తక్కువ లీజు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం లీజు క్రమబద్ధీకరణ చేయాల్సి ఉంది. ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి వారి నిర్ణయం మేరకు ధర నిర్ణయిస్తాం.

- కామేశ్వరరావు, కార్యనిర్వహణ అధికారి, మండపేట

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

కాలువలో పూడికతీత

ద్వారపూడి, న్యూస్‌టుడే. జడ్.మేడపాడు పంచాయతీ పరిధి ప్రధాన మురుగుకాలువలో మురుగు పారడంలేదని, దీంతో దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగాకు విన్నవించారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి వి.అమర్‌నాథ్‌చౌదరి దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. వెంటనే మురుగుకాలువలో పూడిక తొలగింపజేశారు.

చెత్త తొలగించారు..

ద్వారపూడి, న్యూస్‌టుడే: మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ పరిధి చీపురుమార్కెట్ వీధిలో రహదారి పక్కన చెత్త పోస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతుండటంతో స్థానికుల విన్నపాన్ని కార్యదర్శి ఆకుల వి.వి.రమణ వద్దకు తీసుకెళ్లగా స్పందించారు. వెంటనే రహదారి పక్కన పోసిన చెత్తను తొలగింపజేశారు. సమస్య పరిష్కారమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: సమయం: ఉ.10 గం. నుంచి మ. ఒంటి గంట మధ్య
మండపేట: 80085 74183 రామచంద్రపురం: 80085 74191

జీవ ఎరువులతో అధిక దిగుబడి


మాట్లాడుతున్న విజయకుమార్

కాజులూరు, న్యూస్‌టుడే: జీవ ఎరువుల వినియోగించడం ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చని కాకినాడ జిల్లా సంయుక్త వ్యవసాయాధికారి ఎస్.విజయకుమార్ తెలిపారు. గురువారం మండలంలోని శీల గ్రామంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో ఎరువులు, పురుగుమందులు తగ్గించి సహజసిద్ధమైన జీవ ఎరువులు, కషాయాలతో నాణ్యమైన పంటలు పండించాలని సూచించారు. ఈ విధంగా పండించిన పంటను రైతులు సంఘాలుగా ఏర్పడి మంచి ధర వచ్చేలా రైతు ఉత్పాదక సంఘం వారితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సర్పంచి కోమలి వెంకట రమణ, కరప డివిజన్ ఏడీఏ బాబూరావు, మండల వ్యవసాయాధికారి వి.ఆశోక్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

గొల్లపుంత కాలనీలో ఖాళీ స్థలాల పరిశీలన

మండపేట, న్యూస్‌టుడే: స్థానిక 20వ వార్డు గొల్లపుంత కాలనీలో నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాల్లో తుప్పలు పెరిగి విషసర్పాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఈ స్థలాలను మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. వీటిలో తుప్పలు తొలగించి అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ రంగారావు, డీఈఈ శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక అధికారి శ్రీధర్ తదితరులు ఉన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ దుర్గారాణి

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తాపేశ్వరం లాకులు

మండపేట గ్రామీణం: అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తాపేశ్వరం లాకులు ఉన్నాయి. నీటిపారుదశాఖకు చెందిన లాకుల వద్ద సగం ఆగిపోయిన భవనాల్లో, ఖాళీ స్థలాల్లో మందుబాబుల ఆగడాలు అన్నీ ఇన్నీ కాదు. వారు తమ ఇష్టమొచ్చినట్లు బాటిల్స్ పగటగొట్టడం, మందుబాటిల్స్ అక్కడే పడేయడం వంటివి చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నీటిపారుదల శాఖ జేఈ అజీజ్‌ను వివరణ కోరగా బయటవారు రాత్రి సమయంలో లాకులు వద్దకు రాకుండా చర్యలు చేపడతామన్నారు.

శబరిమల వెళ్లిన ఎమ్మెల్యే


పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జోగేశ్వరరావు

మండపేట, న్యూస్‌టుడే: అయ్యప్ప దీక్ష చేపట్టిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గురువారం ఉదయం స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో ఇరుముడి పూజ నిర్వహించి శబరిమల బయలుదేరి వెళ్లారు. ఆయనతోపాటు మరికొంత మంది భక్తులు పూజలో పాల్గొన్నారు. మళ్లీ సోమవారం మండపేట చేరుకుంటారని తెదేపా కార్యాలయ వర్గాలు తెలిపాయి.

నేటి నుంచి చిత్రలేఖనం పోటీలు

మండపేట, న్యూస్‌టుడే: ఈనాడు ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నారు. ఎంపిక చేసిన 10 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నారు.

19న మానవతా ఆశ్రమం వార్షికోత్సవం

రాయవరం, న్యూస్‌టుడే: రాయవరం మండలం లొల్ల గ్రామంలో ఈనెల 19వ తేదీన మానవతా ఆశ్రమం 33వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ, సూర్య నమస్కార పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. అన్ని వయసుల వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు.

నిల్వనీరు ముందుకు పారదేమి...

ఇప్పనపాడు రావిచెట్టు నుంచి ధ్వజ స్తంభం వీధికి వెళ్లే దారిలో నిల్వనీరు ఉంది. స్థానికులు ఆ వీధినుంచి రాకపోకలు సాగించక తప్పడంలేదు. శివాలయంవీధి, ఎస్సీ కాలనీల నుంచి ఈవీధిగుండానే స్థానికులు రాకపోకలు సాగించాల్సి ఉంది. వర్షపునీరు, వాడకపునీరు నిల్వ ఉండటం కారణంగా దోమలు ప్రబలి స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. దీనిపై సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సుబ్బారావును వివరణ కోరగా నీరు వెళ్లేందుకు చర్యలు చేపడతామన్నారు.



- న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

ఇలా వదిలేస్తే ఎలా..!



కపిలేశ్వరపురం పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న చెత్త తరలింపు వాహనాలు నిరుపయోగంగా మారాయి. పల్లెల పరిశుభ్రతే లక్ష్యంగా ప్రారంభించిన స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో తడి, పొడి చెత్తలను వేరుచేయడానికి వీలుగా వీటిని పంచాయతీలకు కేటాయించారు. ప్రస్తుతం అవి నిర్వహణ లేక మూలకు చేరాయి. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి, చెత్త తరలింపు వాహనాలను వినియోగంలోకి తీసుకొచ్చి, గ్రామాలను స్వచ్ఛత వైపు నడిపించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై స్థానిక పంచాయతీ కార్యదర్శి శివచక్రవర్తిని వివరణ కోరగా డ్రైవర్లు లేక వాటిని వినియోగించడం లేదని, త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

-న్యూస్‌టుడే, అంగర

ఒకే ప్రాంతంలో ఇన్ని చెత్త బుట్టలా..!

ఒకే ప్రాంతంలో సుమారు 20కి పైగా చెత్తబుట్టలు ఒకే చోట పారవేసి పనికిరాకుండా ఉంచుతున్నారని సర్వత్రా విమర్శలొస్తున్నాయి. ముచ్చుమిల్లి ప్రాంతంలో చెత్త బుట్టలను ఇంటింటికి తీసుకెళ్లి చెత్తను సేకరించే సమయంలో వాటిని ఉపయోగిస్తారు. అయితే ముచ్చుమిల్లి కవలవారి సావరం, గృహకల్ప సముదాయాల్లో ఉపయోగించేందుకు పాత, కొత్త బుట్టలను ఒకచోట పనికిరాకుండా ఉంచేస్తున్నారు. అవసరానికి తగిన విధంగా ఉపయోగిస్తే పురపాలక సంఘం నిధులు దుర్వినియోగం కావని అవసరానికి మించి చెత్త బుట్టలను రోడ్లపై పారేయడం వల్ల నిధులు దుర్వినియోగం అయ్యేలా ఉన్నాయని పలువురు వాపోతున్నారు. దీనిపై 'న్యూస్‌టుడే' శానిటరీ తనిఖీదారు డేవిడ్‌రాజును వివరణ కోరగా పుష్‌కాట్‌ల కోసం కొత్తగా కొనుగోలు చేసిన చెత్త బుట్టలు ఇచ్చామని అవసరానికి అనుగుణంగానే పాతవి, కొత్తవి చెత్త బుట్టలు వాడుతున్నారని ముచ్చుమిల్లి ప్రాంతంలో 3 పుష్‌కాట్‌లకు 24 చెత్త బుట్టలను ఇచ్చామన్నారు. అవసరానికి అనుగుణంగా వాడేలా సిబ్బందిని ఆదేశిస్తున్నట్లు చెప్పారు.


కవలవారి సావరం రోడ్డులో పడేసిన 20 చెత్త బుట్టలు

- న్యూస్‌టుడే, రామచంద్రపురం



హెచ్చరిక.. బేఖాతరు

వెలగతోడు నుంచి మెర్నిపాడు వెళ్లే రహదారిలో కాలువ గట్టు వద్ద స్థానికులు చెత్తను వేయవద్దంటూ పంచాయతీ ఏర్పాటు చేసిన బోర్డు నామమాత్రంగా ఉంది. ఇక్కడ స్థానికులు, గ్రామస్థులు, పంచాయతీకి చెందినవారు చెత్త పడేస్తున్నారు. ప్రమాదకరమైన ప్లాస్టిక్, సిరంజీలు, సూదులును పారివేస్తున్నారు. వాడిన సిరంజీలు, సూదులను ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్మికులకు ఇస్తే వాటిని వేరు చేసి, యంత్రాల ద్వారా ధ్వంసం చేయాల్సి ఉంది. అలాకాకుండా వారి ఇష్టమొచ్చినట్లు పడేస్తున్నారు. దీనిపై పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి వర్మను వివరణ కోరగా అక్కడ పడేసిన చెత్తాచెదారాలను వేరేచోటికి తరలిస్తామన్నారు. గ్రామస్థులకు ఈప్రదేశంలో చెత్తవేయకుండా అవగాహన కల్పిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం


సర్పంచికి వినతిపత్రం ఇస్తున్న చేనేత కార్మికులు

ఉపాధి పనుల నిర్వహణకు గ్రామ సభ

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: హసనబాద గ్రామంలో చేపట్టబోయే మహాత్మా గాంధీ ఉపాధి హామీపథకం పనుల నిర్వహణకు గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఏపీవో ఈశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన సభలో గ్రామంలో చేపడుతున్న పనుల గురించి వివరించారు. దీనిపై అభ్యంతరాలను స్వీకరించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు గ్రామంలో సమస్యలకు సంబంధించి సర్పంచికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచి నాగిరెడ్డి సతీష్‌రావు, చేనేత సహకారసంఘం మాజీ అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యప్రకాష్, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మందులు అందిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

ఉచిత పశువైద్య శిబిరం

ద్రాక్షారామ: వెల్ల పంచాయతీ వద్ద రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ట్రైనింగ్ సెంటర్ సంయుక్త సంచాలకులు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 84 మంది పాడిరైతులు పాల్గొనగా 124 పాడి పశువులకు మండపేట, వెల్ల, ద్రాక్షారామ, పామర్రు వైద్యులు వి.జి.ఎన్.ప్రసాద్, రామచంద్రరావు, కృష్ణార్జున, బిందు వైద్య సేవలు అందించారు. చేశారు. రూ.20వేల విలువైన గర్భకోశ వ్యాధి నివారణ మందులు, మినరల్ మిక్చర్, కాల్షియం, హార్మోన్ ఇంజిక్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోనసీమ జిల్లా డిప్యూటీ డైరెక్టరు బి.నాగేశ్వరరావు, రామచంద్రపురం ఏడీ రామకృష్ణ, సర్పంచి సూరిబాబు, ఎంపీటీసీ సభ్యులు చిక్కాల స్వామి, అనూరాధ పాల్గొన్నారు.

సాయినాథుడి ఆలయ వార్షికోత్సవం



పామర్రు, న్యూస్‌టుడే: మండలంలో ప్రసిద్ధి పొందిన పాణింగిపల్లి సాయిబాబా ఆలయ 17వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన నిర్వాహకుడు నెక్కంటి శ్రీనివాస్, నాగప్రసూన దంపతులు పూజలు, అభిషేకాలు చేశారు. స్వామివారికి అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకపూజలు, హారతి కార్యక్రమం అనంతరం అన్నసమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు ఇందులో పాల్గొన్నారు. మధ్యాహ్నం గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

సీసీ రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపన

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం మండలం ఓదూరు, నరసాపురపుపేట, చోడవరం, యనమదల గ్రామాల్లో గురువారం సీసీ రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపనలు జరిగాయి. మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం, ఎంపీడీవో కె.పద్మజ్యోతి, పంచాయతీ విస్తరణాధికారి సెలత్‌రాజు, ఆయా గ్రామాల సర్పంచులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థిని ప్రతిభ


బహుమతి అందుకుంటున్న విద్యార్థిని, గైడ్‌టీచరు

మండపేట, న్యూస్‌టుడే: అమలాపురంలో గురువారం నిర్వహించిన పీఎంశ్రీ జిల్లాస్థాయి డిజిటల్ క్వెస్ట్ పోటీలో మండపేట గౌతమి మున్సిపల్ పాఠశాల విద్యార్థిని 3వ స్థానం సాధించారు. గైడ్ టీచరు మేకా రామలక్ష్మి పర్యవేక్షణలో విద్యార్థిని ప్రణీత ప్రదర్శించిన ఎన్విరాన్మెంట్ అవర్ రెస్పాన్సిబులిటి అనే ప్రాజక్టుకు జిల్లాలో మూడో బహుమతి రాగా డీఈవో నుంచి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రణీతను గైడ్‌టీచరు మేకా రామలక్ష్మి, ఎంఈవోలు నాయుడు రామచంద్రరావు, సోమిరెడ్డి అభినందించారు.


సభ్యత్వాల నమోదు చేస్తున్న నాయకులు

భాజపా సభ్యత్వ నమోదు

ద్వారపూడి, న్యూస్‌టుడే. భాజపా సభ్యత్వ నమోదు ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా పురపాలక సంఘాలు, గ్రామాల్లో జోరుగా సాగుతుందని భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు, జిల్లా సభ్యత్వ ప్రముఖ్ కోన సత్యనారాయణ తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం మండపేట మండలం చినద్వారపూడి గ్రామంలో ఇంటింటికి వెళ్లి సభ్యత్వాలు నమోదు చేశారు. కార్యక్రమంలో మండపేట నియోజకవర్గ ఉపసమన్వయకర్త కంకటాల మురళీకృష్ణ, గుబ్బల శ్రీనివాస్, కుడిపూడి అంజి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్రాంతికి రహదారులపై రయ్..రయ్

పరిశీలన

గుంతలు లేని రోడ్లు చూడాలని ముఖ్యమంత్రి ఆదేశాలు

రాష్ట్రంలోని రహదారులపై గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని నవంబరు ఒకటో తేదీ నుంచి మొదలుపెట్టాలని, యుద్ధ ప్రాతిపదికన చేసి సంక్రాంతి నాటికి ఏ రోడ్డు మీద కూడా గుంతలు లేకుండా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా ఇచ్చిన ఆదేశాలతో రామచంద్రపురం, మండపేట నియోజకవర్గ ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. రెండు నియోజకవర్గాల్లోనూ కూడా అత్యంత ప్రమాదకర రహదారులను గుర్తించి వాటిలో ప్రాధాన్యతా క్రమంలో గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, పామర్రు

ఆ 400 మీటర్లు కష్టమే


పామర్రు-ఉట్రుమిల్లి రహదారికి పడిన పెద్ద గోతులు

పామర్రు నుంచి ఉట్రుమిల్లి వెళ్లే ఆర్అండ్‌బి రహదారి నిత్యం రద్దీగానే ఉంటుంది. సుమారు పదిహేను గ్రామాల ప్రజలు దీని మీద ప్రయాణిస్తుంటారు. ఐదేళ్ల కిందట ఈ రహదారిని వెడల్పు చేసి పూర్తి స్థాయిలో ఆధునికీకరించారు. అయితే పామర్రు-కురకాళ్లపల్లి మధ్య 400 మీటర్ల రోడ్డు మాత్రం ప్రయాణికులకు, వాహన చోదకులకు నరకాన్ని చూపుతోంది. పూర్తిగా రోడ్డు గోతులు పడిపోయింది. టేకి డ్రెయిన్‌కు ఇరువైపులా అడుగు లోతు గోతులున్నాయంటే రోడ్డు దుస్థితి అర్థం అవుతోంది. ఇదే విధంగా ఉట్రుమిల్లి, చొల్లంగిపేట వద్ద కూడా పెద్ద పెద్ద గోతులు పడ్డాయి.

ద్రాక్షారామ-కోటిపల్లి రోడ్డులో

ద్రాక్షారామ, కోటిపల్లి రెండు ప్రసిద్ధ పుణ్య శైవక్షేత్రాలు. కోటిపల్లి-ముక్తేశ్వరం రేవు మీదుగా రాకపోకలు సాగించడానికి వేలాది మంది ప్రయాణిస్తుంటారు. ఆరు నెలల కిందట ఈ రహదారిని మొత్తం బాగుచేశారు. అయితే కె.గంగవరం దంగేరు కూడలి నుంచి స్థానిక రైస్‌మిల్లు వరకూ కేవలం 400మీటర్ల దూరాన్ని మాత్రం రోడ్డు వేయకుండా వదిలేశారు. ప్రస్తుతం ఇది మరింత అధ్వానంగా మారింది.


కె.గంగవరం వద్ద రెండు పుణ్యక్షేత్రాల మధ్య అధ్వానంగా

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాం..

ఇటీవల కురిసిన, కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు వీటి పరిస్థితి మరింత దిగజారింది. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే బాగు చేస్తాం. నియోజకవర్గంలో కూళ్ల-పామర్రు రహదారి అభివృద్ధికి రూ.20లక్షలు మంజూరయ్యాయి. త్వరలో పనులు మొదలు పెట్టిస్తాం.

- సూర్యనారాయణ, ఆర్అండ్‌బి డీఈ

అత్యంత ప్రమాదకరం

ద్రాక్షారామ నుంచి యానాం వరకు సుమారు 20కిమీ ఉంటుంది. నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఈ రహదారి పలు చోట్ల గుంతల మయంగా మారింది. ముఖ్యంగా ఎర్రపోతవరం లాకుల వద్ద రోడ్డు పంట కాల్వ వైపు వంగి ఉంటుంది. అది బాగా కుంగిపోయింది. దాంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఐదేళ్ల నుంచి ఈ రహదారి మరమ్మతులకు నోచుకోలేదు. సుమారు 25 గ్రామాల ప్రజలకు ప్రయోజనం కలిగించే ఈ రహదారిని మొదటి ప్రాధాన్యతలో మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.


తరచు ప్రమాదాలకు నిలయంగా రోడ్డు